Cat-1390

# డార్వినిజం హేతువాదం

రావిపూడి వెంకటాద్రి



211.4
వెంకట.. డార్వి
1165

హేమా పబ్లికేషన్స్,
చీరాల-523155

# డార్వినిజం — హేతువాదం

రావిపూడి వెంకటాద్రి

హేమాపబ్లికేషన్స్,
చీరాల–523155

DARWINISM-HETUVADAM

By

*RAVIPUDI VENKATADRI,*
**President, I.R.A.**
**Editor: HETUVADI,**
**CHIRALA-523155 (A.P.)**

6799
Cat-1590
211.4

(C) రచయితవి

తొలి ముద్రణ ఫిబ్రవరి 1995

వెల రు 10/-

ప్రతులకు :- ఎడిటర్, హేతువాది,
చీరాల-523155(AP)

ప్రచురణ: హేమాపబ్లికేషన్స్ - చీరాల

RATIONALISM ◆ HUMANISM
HEMA
PUBLICATIONS CHIRALA

**Printed at HEMA PRINTERS, CHIRALA.**

# డార్వినిజం—హేతువాదం

## ఒక్కమాట

మానవజాతి చరిత్ర ముమ్ముందుకు సాగడానికయినా. వెన్వెనక్కి నడవడానికయినా మూలకారణం భావాలు. ఆటవిక మానవుడికీ, ఆధునిక మానవుడికీ మధ్యగల అంతరాన్ని కొలవడానికి పనికివచ్చే సాధనాలు భావాలే.

చరిత్ర గతిని స్థూలంగా క్రీస్తుకు పూర్వం, క్రీస్తుకు తర్వాత అని మనం విభజించి చూస్తున్నాం. అలా చూచినపుడు క్రీస్తుకు పూర్వం ఐదారు శతాబ్దుల్లో—ముఖ్యంగా భారతదేశం, గ్రీసు వంటి దేశాల్లో — మనిషికీ, మనుష్యేతర ప్రకృతికీ, (దైవానికీకూడా) మధ్యగల సంబంధాల గురించి సృజనాత్మక తాత్విక ఆలోచన జరిగినట్లు కన్పిస్తుంది. క్రీస్తుకు తర్వాత 16వ శతాబ్ది వరకు ఆ ఆలోచనల మీద వ్యాఖ్యానాలు తప్ప, స్వతంత్ర వివేచన జరిగినట్లు కన్పించదు.

అలాంటి తరుణంలో విశ్వానికి భూమి కేంద్రం కాదనీ, ఇతర గ్రహాదులతో పాటుభూమి కూడా సూర్యుడి చుట్టూ తిరుగుతున్నదనీ కొత్త ఆలోచనకు ప్రాచుర్యమిచ్చాడు నికోలస్ కోపర్నికస్ (1473-1543). భూమితోపాటు మతపునాదులుకదిలాయి. దైవభావమూ కదిలింది. సూర్యకేంద్ర సిద్ధాంతం కేవలంవూహ కాదు. అది వాస్తవాల పరిశీలన మీద ఆధారపడింది. పరిశోధనల ద్వారా సవరణలకూ, వివరణలకూ తలవొగ్గుతూ ధ్రువపడింది. ఫలితంగా, అంతకుముందు వూహాపోహలమీద ఆధారపడుతూ వచ్చిన దార్శనిక చింతన వాస్తవాల మీద ఆధారపడడం ప్రారంభించింది.

ఆధునిక విజ్ఞానశాస్త్రయుగం ప్రారంభమైంది.

19వ శతాబ్దిమధ్యలో శాస్త్రవిజ్ఞానానికి మరో కొత్త పూపు వచ్చింది. ఛార్లెస్‌రాబర్ట్‌డార్విన్ (1809-82) ప్రకృతి పరిణామంలో భాగంగా జీవమూ, ఆ జీవపరిణామ ఫలితంగా కోతిదశ అనంతరం మనిషీ యేర్పడ్డాయని అనేక ఆధారాలతో రుజువుచేశాడు. దేవుడుమట్టితో బొమ్మనుచేసి గాలిపూదితే మనిషి అయ్యాడనే మతవాదుల ప్రత్యేక సృష్టివాదానికి చావుదెబ్బ తగిలింది. జీవప్రపంచం నుంచి కూడా దైవభావానికి మరో సారి చలనంకల్గింది. అనంతరం పరిశీలనలు,పరిశోధనలు, ప్రయోగాలు, జన్యుశాస్త్ర ఆవిష్కరణలు జీవపరిణామ వాదాన్ని బలపరుస్తూనేవస్తున్నాయి.

అయినా, సూర్యకేంద్ర సిద్ధాంతంపై పోరాటాన్ని మానుకున్న బైబిలు మతవాదులు జీవపరిణామం మీదయింకా పోరాటం సాగిస్తూనేవున్నారు. దాన్ని అనుకరించడానికి యితర మతస్థులున్నూ ప్రయత్నిస్తున్నారు. చీకటిలో దాక్కోవడం మతస్థుల ఆనవాయితీ. ఎక్కడ అజ్ఞానం వుంటుందో, అక్కడ దేవుణ్ణిచూపడానికి వాళ్లు ప్రయత్నిస్తారు. కారణం తెలియని వాటన్నింటికి దేవుణ్ణే కారణంగా చూపుతారు. మానవునికి తెలియని అంశం యెప్పుడూ యేదో ఒకటివుంటుంది. కాబట్టి, దేవుడికి అక్కడ ఆశ్రయం కల్పిస్తారు మతస్థులు. అంటే, దేవుడు చావడు. మనిషి వివేకవంతుడయ్యే కొలదీ ఒకచోటనుంచి మరోచోటకి పారిపోతూనే వుంటాడు.

జీవ పరిణామ వాదాన్ని డార్వినిజమని మతవాదులు హేళనచేశారు. చివరకు ఆపేరు ప్రసిద్ధమైంది. ఆపేరుమతా

వాదుల సంస్కార హీనతను వెల్లడిచేస్తున్నది. పరిణామవాద బీజాలు గ్రీకు వైజ్ఞానికుల ఆలోచనల్లోనే వున్నాయి. తర్వాత బఫన్, ఎరాస్మస్ డార్విన్, గోథే. లామార్క్ ప్రభృతులు పరిణామవాద యోచనలు చేశారు. డార్విన్ సమకాలంలోని ఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలేస్(1823-1913) కూడా డార్విన్ చేరిన నిర్ణయాలకే చేరాడు. డార్విన్ ఘనతయేమంటే, తాను 50 సంవత్సరాలుగా సేకరించిన సాక్ష్యాధారాలు చూపి పరిణామవాదాన్ని సమర్థించాడు. ప్రకృతివరణ సూత్రాన్ని పరిణామప్రక్రియలో ప్రధానకారణంగా భావించాడు. డార్విన్ 1859లో "జీవజాతుల మూలం" (origin of Species) ప్రచురించాడు. అదే సూత్రాన్ని థామస్‌హక్స్లీ 1863లో మానవావతరణకు కూడా అన్వయించాడు. తర్వాత 1871లో మానవావతరణ (Descent of Man) అనే గ్రంథం డార్విన్ ప్రచురించాడు. అదంతా పరిణామవాదమే. అది తప్పయితే జీవశాస్త్రమంతా తప్పవుతుంది. పరిణామం జరిగిన తీరును యింతవరకంటె సమర్థవంతంగా డార్విన్ ఆవిష్కరించాడు. అయినా, ఆయన పేరుతో పరిణామవాదం ప్రసిద్ధమైపోయింది. ఆ పేరుతోనే యిప్పటికీ మతవాదులు పరిణామవాదాన్ని పిలుస్తున్నారు. అందుకే యీపుస్తకం పేరుకూడా "డార్వినిజం - హేతువాదం" అని యెంపిక చేశాం

డార్విన్ శతవర్ధంతి సందర్భంగా 1983 ఏప్రిల్‌లో వెలువడిన "హేతువాది" ప్రత్యేక సంచిక నుంచి యిందులోని వ్యాసాలు యెంపిక చేయబడ్డాయి. డార్విన్ పేరుతో ప్రచారమయ్యే అబద్ధాలను, అపోహలను దూరం చేయడానికి యీ సంకలనం తోడుపడగలదని ఆశిస్తున్నాం.

2-2-1985 రావిపూడివెంకటాద్రి

చీరాల ఎడిటర్, హేతువాది

## ఇందులో


| | | | |
|---|---|---|---|
| | పరిచయం | | |
| 1 | డార్విన్-జీవపరిణామ సిద్ధాంతం – | ఆరమళ్ళ పూర్ణచంద్ర | 1 |
| 2. | డార్విన్-హేతువాదం | రావిపూడి వెంకటాద్రి | 12 |
| 3. | నేను ఆస్తికుడ్నా, నాస్తికుడ్నా? | చార్లెస్ డార్విన్ | 18 |
| 4. | చార్లెస్‌డార్విన్-కారల్‌మార్క్స్ | రావిపూడివెంకటాద్రి | 26 |
| 5. | మార్క్స్ కాపిటల్-డార్విన్‌కి అంకితం – | రావిపూడివెంకటాద్రి | 31 |
| 6. | బైబిలు భక్తుల కోతిచట్టం | రావిపూడివెంకటాద్రి | 37 |
| 7. | సృష్టివాదం-పరిణామవాదం | రావిపూడివెంకటాద్రి | 46 |
| 8. | అర్కన్‌సాస్ కోర్టు తీర్పు | అను॥ రావిపూడివెంకటాద్రి | 49 |
| 9. | డార్వినిజం పై సవాలుదర్జా | రావిపూడివెంకటాద్రి | 62 |
| 10. | బిషప్పులాంటి మనిషి కంటె కోతినయం – | జి. పర్వతయ్య | 64 |
| 11. | జీవపరిణామం-మతపరిణామం | జూలియన్‌హక్స్లీ | 85 |

# 1. డార్విన్ - జీవపరిణామ సిద్ధాంతము

మానవ జాతిలో జిజ్ఞాస ఈనాటిది కాదు. ఆదిమ మానవుడి నుండి నేటివరకు మానవుని సత్యాన్వేషణ కొనసాగుతూనే వుంది. ఇక ముందు కూడా సాగుతూనే ఉంటుంది. ఈ గుణమే మానవజాతిని ఇతర జంతుజాలం నుండి వేరుచేస్తుంది. ఆధునిక మానవ జాతికి జీవశాస్త్ర నామం హోమోసేపియన్స్ (Homo Sapiens). అంటే వివేకిమైన మానవుడు. (sapiens అనే Latin పదానికి అర్థం వివేకం కల అని.)

మానవుని హేతుబద్ధమైన ఆలోచనా ప్రవంతిలో భాగంగానే మతాలు, వాటికి ఆలంబనమైన దేవుడు, సృష్టి సిద్ధాంతం పుట్టుకొచ్చినై. ప్రపంచంలో మానవజాతులన్నీ ఏదో ఒక రూపంలో ఎప్పుడో ఒకప్పుడు–అప్పటికి వారికి వున్న పరిమిత జ్ఞానం ఆధారంగా దేవుణ్ణి లేక దేవుళ్ళను సృష్టించుకొన్నవి. ఆ సిద్ధాంతంలోని ముఖ్యాంశాలను స్థూలంగా ఈ క్రింది విధంగా చెప్పుకోవచ్చు:

—ఈ సృష్టికి అతీతంగా అత్యంత శక్తివంతమైన ఒక దైవం లేక శక్తివున్నది. అదే ఈ సృష్టికి మూలం. ఈ సృష్టికి ముందే ఆ దైవం ఉంది. ఒక ప్రయోజనం కోసం, ఒక ప్రణాళిక ప్రకారం ఆ దేవుడు ఈ భౌతిక ప్రపంచాన్ని సృష్టించాడు. ఏ ప్రళయ సమయంలోనో ఆ దేవుడే వచ్చి యీ ప్రపంచాన్ని రక్షిస్తాడు.—

ఈ సృష్టి సిద్ధాంతాన్ని దేవుడే మానవులకు చెప్పినట్లుగా అన్ని మతాలూ ఘోషిస్తున్నాయి. ఇదే నిజమైతే, ఒకే ప్రపం

చంలో నివసిస్తున్న అన్ని జాతుల మానవులకు యీ సృష్టిని నిర్మించిన దేవుడు ఒకే విధంగా చెప్పివుండాలి. కాని. మతాలన్నీ పరిశీలించిచూస్తే, ఈ ఆవేశిత జ్ఞానం (revealed wisdom) ప్రకారం సృష్టి ఒకేవిధంగా జరిగినట్లు తెలియటంలేదు. క్రైస్తవ మతం ఒక విధంగా చెపుతుంది. హిందూమతం వేరే విధంగా చెబుతుంది.. అలాగే యితర మతాలుకూడా: ఒక ప్రపంచం గురించి భిన్న తరహాలైన యీ సిద్ధాంతాలన్నీ సరైనవి కావటానికి వీల్లేదు. ఈఒక్క విషయాన్ని బట్టేసృష్టి సిద్ధాంతం తప్పని నిర్ధారించవచ్చును.

మనిషి జ్ఞానం పెరుగుతున్న కొలది మతంఎదురుదెబ్బలు తింటూనేవున్నది.భూకేంద్రసిద్ధాంతంతప్పనిచెప్పినకోపర్నికస్ నుండి భౌతిక ప్రపంచం నియమబద్ధమన్న న్యూటన్‌దాకా మత పునాదులను కదిలించి వేస్తూనే వచ్చారు.

భౌతిక శాస్త్రంలో న్యూటన్ చేసిన పనిని జీవశాస్త్రంలో డార్విన్ చేశాడు. డార్విన్ వృత్తి రీత్యా శాస్త్రజ్ఞుడు కాదు. శాస్త్రంలో అభిరుచి కలిగిన ఒక ఔత్సాహికుడు మాత్రమే. 'బీగిల్' ప్రయాణానికి కొన్ని వారాల ముందు సెడ్జివిక్ అనే భూగర్భ శాస్త్రవేత్తతో పరిచయమయిందాకా అతనికి సైన్సు అంటే ఏమిటో తెలియదు. కాని అతనికి రాళ్ళు, రప్పలు, శిలాజాలు (fossils) సేకరించటం సరదా. ఆ సరదాయే చార్లెస్ డార్విన్ పేరును కోపర్నికస్, గెలీలియో, న్యూటన్, ఐన్‌స్టీన్‌ల సరసన చేర్చింది.

డార్విన్ అనగానే మనకు గుర్తువచ్చేది జీవపరిణామ సిద్ధాంతం (organic evolution). కాని పరిణామం జరుగుతుం-

దని మొదట ఊహించినవాడు డార్విన్ కాదు. డార్విన్‌కి ముందే ఫ్రెంచి తత్వవేత్తలైన మాంటెస్క్యూ (Montesquieu) బఫాన్ (Buffon) మావర్టీస్ (Maupertuis), డైడెరాట్ (Diderot), డార్విన్ తాతగారైన ఎరాస్మస్ డార్విన్, లామార్క్ (Lamarck) జీవరాసులలో పరిణామం జరుగుతుందని గ్రహించిన వారిలో వున్నారు. కాని ప్రథమంగా జీవరాశులలోని పరిణామాన్ని శాస్త్రబద్ధంగా వివరించి, "జీవపదార్థ ప్రధాన గుణం పరిణామం లేక మార్పే కాని, స్థిరత్వం (stability) కాదు" అని సూత్రీకరించినవాడు డార్విన్.

'ఇప్పుడున్న జీవరాసులు యింతకు ముందున్న జీవుల నుండి పరిణామంచెంది ప్రస్తుతమున్న రూపంలోనికి మార్పు చెందినవి' అని చెప్పేదే డార్వినిజం. 'నిరంతర జీవన పోరాటం (struggle for existerce) లో ప్రాకృతిక వరణము (natural selection) ద్వారా సర్వోత్తమమైన వాటి మనుగడ (survival of the fittest) పరిసరాల కనుగుణంగా (Adaptation) వానిలో ప్రయోజనాత్మకమైన మార్పులద్వారా, నూతన జీవప్రాదుర్భావం (origin of species) జరుగుతుంది, అంటాడు డార్విన్.

తన యీసిద్ధాంతం తత్వశాస్త్రంలో కలిగించే అలజడిని ముందుగానే గ్రహించి 1837లో తన (note books) లో "యీ సిద్ధాంతం అధిభౌతికశాస్త్రం (metaphysics)పై ప్రభావం కలిగిస్తుంది" అని వ్రాశాడు. డార్విన్ చెప్పలేదు. కాని, ఇది మతాన్ని అంతకంటే ఎక్కువగా కుదిపివేసింది. ఈ సందర్భంలో డార్విన్ తన ఆత్మకథలో వ్రాసిన ఈ క్రింది మాటలను గుర్తు చేసుకోవడం అవసరం.

"I had gradually come, by this time to see that the old Testament from its manifestly false history of the world and from its attributing to God the feelings of a revengeful tyrant, was no more to be trusted than the sacred books of the Hindoos or beliefs of any barbarian. The question then continually rose before my mind and would not be banished, - is it credible that if God were now to make a revelation to the Hindoos would he permit it to be connected with the belief in Vishnu, Siva, & Co as Christianity is connected with the old Testament. This appeared to me utterly incredible.

By further reflecting that the clearest evidence would be requisite to make any sane man believe in the miracles by which Christianity is supported'-that the more we know of the fixed laws of nature, the more incredible do miracles become,- that the men at that time were ignorant and credulous to a degree almost incomprehensible by us - that the gospels cannot be proved to have been written simultaneously with the events, - that they differ in many important details, far too important as it seemed to me to be admitted as the usual inaccuracies of eye witnessees- by such reflections as these, which I give not as having the least novelty or value, but as they influenced me, I gradually came to disbelieve in christianity as a divine revelation ...and have never since doubted even for a single second that my conclusion was correct".

"పాత నిబంధనలోని శుద్ధ అబద్ధపు ప్రపంచ చరిత్రను బట్టి, మాత్సర్య గ్రస్తుడైన క్రూరుని భావాలను దేవుడికి ఆపాదించడాన్ని బట్టి హిందువుల పవిత్ర గ్రంథాల కంటె, ఆటవికుల మూఢనమ్మకాల కంటె ఎక్కువగా బైబిలును నమ్మనవసరం లేదని క్రమంగా నేను గుర్తించాను. అప్పటి నుంచి నా మనస్సులో వదలకుండా వేధిస్తున్న సమస్య యేమిటంటే— ఇప్పుడు దేవుడు హిందువులకు దివ్యజ్ఞానం కల్పించడం జరిగితే క్రైస్తవం పాత నిబంధనతో ముడి పడివున్నట్లుగా విష్ణువు, శివుడు వగైరాలను నమ్మడానికి వారిని అనుమతిస్తాడా అని.

ఇంకా ఆలోచిస్తే క్రైస్తవ మతానికి ఆధారభూతమైన మహత్యాలను నమ్మాలంటే ఇంగిత జ్ఞానం వున్నవాడికి వీలు లేదు. ప్రకృతిని గురించిన జ్ఞానం పెరిగేకొలదీ మహత్యాలు నమ్మరానివిగా మారిపోతై. ఆ రోజుల్లో మనుషులు మన వూహకందనంత అమాయకులు. సంఘటనలు జరిగినప్పుడే సువార్తలు వ్రాయబడలేదని వారు గ్రహించలేదు. అనేక వివరాల్లో నమ్మరాని విషయాలున్నాయి. ఇలాంటి ఆలోచనలు కొత్తవి కాకపోయినా, వాటి ప్రభావం నామీదపడి క్రమంగా క్రైస్తవ మతంమీద, దివ్యజ్ఞానం మీద నమ్మకం పోయింది. నా నిర్ణయాలు తప్పని ఏ క్షణంలోనూ ఆ తర్వాత నేను ఆలోచించలేకపోయాను."

1836లో 'బీగిల్' అనే ఓడపై ప్రయాణానికి ముందు డార్విన్ అందరిలాగానే సృష్టి సిద్ధాంతాన్ని నమ్మినవ్యక్తి. ఈ

ప్రయాణంలో కొన్ని వేల శిలాజాలు (fossils) సేకరించి, తనకు కనిపించిన జంతువులతో పోల్చి వాటి మధ్యవున్న తేడాలను, పోలికలను పరిశీలించి, జీవరాశులలో పరిణామం జరిగిందన్న నిర్ణయానికి 1838 లోనే వచ్చాడు. కాని, 1858 దాకా తన యీ నిర్ణయాన్ని బహిర్గత పరచలేదు. 1858లో లండన్‌లోని లిన్నియస్ సొసైటీ సమావేశంలో అప్పటికి అదే అభిప్రాయానికి వచ్చిన ఆల్‌ఫ్రెడ్ రస్సెల్ వాలాస్ (Alfred Russel wallace) అనే శాస్త్రవేత్తతో కలిసి, సంయుక్తంగా సమర్పించిన శాస్త్రీయ పత్రంలో ఈ సిద్ధాంతాన్ని వివరించాడు. 1859లో ఇదే విషయాన్ని తన 'Orgin of 'Species' (జీవుల ప్రాదుర్భావం) అనే గ్రంథంలో విపులీకరించాడు. మతస్తుల సృష్టి సిద్ధాంతాన్ని విమర్శించినందుకు వారి ఆగ్రహానికి గురయ్యాడు. తర్వాత 1871లో 'The Descent of Man' (మానవ అవతరణ) అనే గ్రంథంలో బైబిల్ సిద్ధాంతాలను పూర్తిగా త్రోసివేసి, పెద్ద అలజడిని కలిగించాడు.

డార్విన్ మరొక పుస్తకం Expression of Emotions-in Man and Animals (1875) ఆధునిక మానసిక, సాంఘిక శాస్త్రాలపై చాల ప్రభావాన్ని కలిగించింది. ఇంతేకాక, అనేక ఇతర శాస్త్రగ్రంథాలు వ్రాసి భూగర్భ,జీవ,సాంఘిక శాస్త్రాలలో ప్రముఖ శాస్త్రవేత్తగా పేరుగాంచాడు.

పరిణామం ఎందుకు జరుగుతుందో డార్విన్ చెప్పలేదు. పరిణామం జరిగితేనే కొన్ని ప్రశ్నలకు జవాబు చెప్పగలం. కాబట్టి, పరిణామం జరిగి వుండాలని నిర్ధారణకువచ్చాడు. పరిణామ సిద్ధాంతానికి ముందు జీవశాస్త్రం అగమ్యంగావుండేది. జీవి

(Species) అంటే ఏమిటి? జీవులకు, శిలాజాలకు సంబంధమేమిటి? వానిలో పోలికలకు, తేడాలకు కారణమేమిటి? కొన్ని జంతువులు కొన్ని ప్రాంతాలలోనే ఎందుకున్నవి? కొన్ని వర్గాలు నశించటానికి కారణమేమిటి? ఇలాంటి ప్రశ్నలకెన్నింటికో పరిణామ సిద్ధాంతం జవాబు చెప్పగలిగింది.

డార్విన్ పరిణామ సిద్ధాంతం సూత్రీకరించేనాటికి జన్యుశాస్త్రం [Genetics] కానీ, అణుజీవశాస్త్రం [Molecular biology] కాని అభివృద్ధి చెందివుండలేదు. అందువలన డార్విన్ ఊహలు కొన్ని తప్పయినై. అంతమాత్రాన డార్విన్ చెప్పినదంతా తప్పనికాని జీవశాస్త్రంలో డార్విన్‌కున్న స్థానాన్ని కించపరచటం కానీ సరైన పనికాదు.

జీవపరిణామమనేది జన్యు సముదాయంలో జరిగే మార్పు. [Statistical change in gene pool]. జన్యు సముదాయంలో వైవిధ్యం రావడానికి కారణమేమిటి? ఈ వైవిధ్యాన్ని ఏ శక్తులు నిర్దేశిస్తున్నాయి? అనే విషయమై సైన్సు పూర్తిగా ఇప్పటికీ జవాబు చెప్పలేదు. కాని, ఒకప్పుడు ప్రకృతి సహజంగావచ్చే ఈ మార్పులను అణుజీవశాస్త్రం [Molecular biology] అభివృద్ధిచెందిన తర్వాత మానవుడు కృత్రిమంగా సాధించగలుగుతున్నాడు. ఈ అణుజీవశాస్త్రం ఆధారంగా నేడు E.coli (ఇకోలి) అనే సూక్ష్మజీవి నుండి ఇన్సులిన్ [insulin] తయారు చేయటానికి వీలైంది. అలాగే పెట్రోలియం తిని ప్రోటీనులను ఉత్పత్తిచేసే బాక్టీరియా, ఇంకే విధంగాను డిగ్రేడ్ [degrade] చేయటానికి వీలులేని పెస్టిసైడ్స్, డిటర్జెంట్ వేస్ట్[waste]లను తినే బాక్టీరియాలను

కృత్రిమంగా తయారుచేసి, మన పరిసరాల పరిరక్షణలో కూడ ఈ 'మాలిక్యులర్ బయాలజీ' లేక 'జెనెటిక్ ఇంజనీరింగ్ మనకు వుపయోగపడుతుంది. మతస్థుల ప్రకారం దేవుడు మాత్రమే చేయగల్గిన సృష్టిని నేడు మానవుడు సైన్సుసాయంతో చేయగల్గుతున్నాడు.

పరిణామ సిద్ధాంతం మొత్తంమీద సరైనదేనని ఆధునిక శరీర నిర్మాణ శాస్త్రం [Anatomy], ప్రవర్తనా శాస్త్రం [Ethology], సీరాలజీ [serology]. జీవరసాయన శాస్త్రం [Biochemistry], పరాన్న జీవశాస్త్రం [Parasitology]. పేలియాంటాలజీ, బయోజాగ్రఫిక్ ఎవిడెన్స్ ద్వారా ధృవపడింది.

పరిణామం జరగటమే నిజమైతే, ఆ పరిణామం ఇప్పుడున్న జీవులలో ఎందుకు కనబడటంలేదు? అని కొందరి ప్రశ్న. ప్రకృతిలో పరిణామప్రక్రియ హాల్డేన్ అన్నట్లుగా ఊహించలేనంత తక్కువ వేగంతో [unimaginably slow process] జరుగుతుంది. పైన చెప్పినట్లుగా, ఆధునిక విజ్ఞానం సాయంతో నేటి మానవుడు క్రొంగొత్త జీవులను ప్రయోగశాలలో సృష్టించగలుగుతున్నాడు. ఆరుకోట్ల సంవత్సరాల చరిత్రలో క్షీరదాల [mammals]లో మొత్తం 20 ప్రజాతుల [genera] ఉద్భవించినట్లు తెలుస్తుంది. అంటే ఒక క్రొత్త ప్రజాతి (genus) వుద్భవించడానికి సుమారు 20 లక్షల సంవత్సరాలు పట్టినట్లు తెలుస్తున్నది. వాతావరణ, పరిసర పరిస్థితులు ఎక్కువ స్థిరంగా వుండే సముద్ర జీవులలో క్రొత్త ప్రజాతి (genus) ఏర్పడటానికి సుమారు కోటి సంవత్స

రాలు పడుతుందని తెలుస్తుంది. ఒకేజాతికి చెందిన జీవులలో ఎముకల పరిమాణంలో పది వేల సంవత్సరాలలో కూడ కొలవదగ్గ (measurable) మార్పేమీ వుండకపోవచ్చు. ఎన్నో వేల సంవత్సరాల శిలాజాలను పరిశీలించినప్పటికీ, మనం పరిణామదశ (trend of evolution) మాత్రమే తెలిసికొనగలము.

విప్లవాత్మకమైన మార్పులు వచ్చినపుడు మాత్రం ఈ పరిణామాన్ని మనం గమనించగలం. బిస్టన్ బెట్యులేరియా (Biston betularia) అనే బూడిద రంగుగల కీటకాలు చెట్ల బెరడుపై నివసిస్తూ ఆబెరడు రంగుతో కలిసిపోయి పక్షుల బారినుండి ఆత్మరక్షణ చేసికొనెడివి. 1850 కి ముందుగా అరుదుగా కనపడెడి అదేజాతికి చెందిన Biston carbonaria) నల్ల కీటకం) ఇలాంటి అవకాశం లేక పక్షులవలన నాశనమై అభివృద్ధి చెందలేదు. పారిశ్రామిక విప్లవానంతరం యూరపులోని అనేక నగరాలలో బొగ్గు మొదలగు వాని వలన కలిగిన కాలుష్యం వల్ల చెట్లు నల్లబడి, బూడిద రంగుగల కీటకం తన అవకాశాన్ని పోగొట్టుకొని పక్షులవాతబడి నశించినది. ఇదే సమయంలో నల్ల కీటకం కొత్తగా వచ్చిన మార్పులవలన పక్షులకు కనపడక బాగా అభివృద్ధి చెందింది. ఇపుడు బూడిద రంగు కీటకం అరుదుగా మాత్రమే కనిపిస్తుంది. డార్విన్ చెప్పిన ప్రాకృతిక వరణానికి (natural selection) ఇది మంచి ఉదాహరణ.

పరిణామమే జరిగినట్లయితే కొన్ని జీవులు ఏ విధంగా అంతకు ముందున్న జీవులనుండి పుద్భవించినవో ప్రస్తుతం సైన్సు సమాధానం చెప్పలేకున్నది. ఉదాహరణకు ఆధునిక

మానవజాతి [ Homo sapiens ] Homo erectus అను జీవినుండి పుద్భవించింది అనుకొంటున్నాము. కాని (Homo erectus)ఏ విధమైన intermediate species‌కి మార్పు చెంది ప్రస్తుతమున్న రూపంలోకి వచ్చిందో తెలియటం లేదు. అలాగే గబ్బిలాల (Bats) రెక్కలు అంతకు ముందున్న రెక్కలు లేని జీవులనుండి ఎలా పుద్భవించినవో తెలియకున్నది. ఇలాంటి missing evolutionary links చూపి పరిణామం జరిగి వుండటానికి వీల్లేదనీ దేవుడే సృష్టించి వుండాలని సృష్టి వాదుల వాదన.

విశిష్టమైన సంక్లిష్టమైన కన్నులు మొదలగు జ్ఞానేంద్రియాలు ఎలా ఏర్పడినవి అనేది మరొక ప్రశ్న. పరిసరాల కనుగుణంగా అకస్మాత్తుగా పెద్ద పెద్ద భౌతిక రసాయనిక మార్పులు జరగటానికి అవకాశముందని ఆధునిక విజ్ఞానం ధృవపరిచింది. కొన్ని జీవులలో కన్నుకుబదులుగా ఒకే ఒక జీవకణము (cell) కన్నులపాత్ర నిర్వహిస్తున్నది. అ కణాలే కన్నుగా పరిణామం చెందివుండవచ్చు.

సుందరమైన వస్తువులు ఏ సృష్టికర్తో వాటిని అలా నిర్మించకపోతే ఎలా ఏర్పడినవి అని ఇంకో ప్రశ్న. 'సుందర' అనేది 'కేవల విలువ' (absolute value) కాదు. అది వ్యక్తిగతం (subjctive) జీవశాస్త్రం ద్వారా ఏది సుందరం, ఏది వికారం అని చెప్పటానికి వీలులేదు. అయితే గాలి ద్వారా పరపరాగ సంపర్కం (cross-fertisation) జరిగే ఏ పుష్పమూ సుందరమైన రంగులు కలిగివుండలేదు. కీటకాల ద్వారానో, లేక పక్షుల ద్వారానో మాత్రమే పరపరాగ సంపర్కం-

జరిగే పుష్పాలు—లేక అలా మేర్పడే ఫలాలు కీటకాలు
లేక పక్షుల నాకర్షించుటకై సుందరమైన రంగులు కలిగి
వున్నవి.

జంతువులకు భాషలేదు. వాటి పరిణామంలో ఉత్కృష్ట రూపమైన మానవుడు మాత్రమే అమోఘమైన భాషా సంపదను ఎలా పెంపొందించుకొన్నాడు? అని మరొక ప్రశ్న.

డార్విన్‌చే తొలిగా సూత్రీకరించబడిన జీవపరిణామ సిద్ధాంతం ఇప్పటికి ఎన్నో ప్రశ్నలకు జవాబు చెప్పింది. ఇంకెన్నో ప్రశ్నలను కొత్తగా రేకెత్తించింది. అభివృద్ధి చెందుతున్న సైన్సు ఇప్పటి ప్రశ్నలకు మున్ముందు సమాధానం చెప్తుంది. కాని సృష్టి సిద్ధాంతానికి ఇంతవరకు ఒక్క ఆధారం కూడా దొరకలేదు. కాని సైన్సు యిప్పటికి జవాబు చెప్పలేని ప్రశ్నలు ఆధారంగా మతస్థులు తమ మతాలను నిలబెట్టుకోవాలనుకోడం, సృష్టిశాస్త్రం [creation science] అనే పేరు పెట్టుకోవటం ద్వారా ప్రజలను మభ్యపెట్ట ప్రయత్నించటం వారి దివాళాకోరుతనాన్ని మాత్రమే తెలియచేస్తుంది.

—ఆరమళ్ళ పూర్ణచంద్రి

# 2. డార్విన్ హేతువాదం

జీవపరిణామ సిద్ధాంతాన్ని గురించిన ఆలోచనలు యేదో ఒక రూపంలో రెండువేల సంవత్సరాలకు పూర్వంనుంచీ వున్నయ్. ఆధునిక యుగంలో ప్రథమంగా ఫ్రెంచి జీవశాస్త్రజ్ఞుడు లామార్క్ (1744-1829) దానిమీద విశేషంగా కృషిచేసి గ్రంథాలు రాసినప్పటికీ. చార్లెస్ రాబర్ట్ డార్విన్ (1809-82) పరిశోధనలతో దానికి ప్రసిద్ధి యేర్పడింది. 1859లో "జాతుల అవిర్భావం" [Origin Species] గురించి ఆయన పుస్తకం ప్రచురించాడు. క్రైస్తవమతం తుపానురేపింది. జీవజాతులన్నీ క్రమానుగతంగా పరిణామం చెందాయనేది డార్విన్ పుస్తకం స్పష్టంవేసింది. 1863లో ధామస్ హక్స్లీ ఆ సూత్రాన్ని మనిషికికూడా అన్వయించాడు. తర్వాత 1871లో డార్విన్ "నరావతరణ" [Descent of man] అనే పుస్తకం వెలువరించాడు. క్రైస్తవులిక వుండబట్టలేక పోయారు. జీవపరిణామ సిద్ధాంతాన్ని హేళనగా "డార్వినిజం" అని పిలవడం ప్రారంభించారు. చివరకది డార్వినిజంగానే ప్రఖ్యాతమైంది.

జీవజాతులన్నీ క్రమపరిణామంలో యేర్పడ్డాయని అంగీకరిస్తే బైబిలు సృష్టి సిద్ధాంతం తప్పయిపోతుంది. దేవుడు తన రూపంలో మనిషిని సృష్టించాడనే బైబిలువాదం అబద్ధమై పోతుంది. అది అబద్ధమైతే బైబిలు అంతా అబద్ధమై పోతుంది. అందువల్ల జీవపరిణామ సిద్ధాంతం క్రైస్తవ మతస్థులకు కంటకప్రాయమై పోతుంది. క్రైస్తవేతర దేశాల్లో విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందకపోవడం వల్ల క్రైస్తవేతరులు దాని

పూసు మొత్తుకోలేదు. అభివృద్ధిచెందిన పాశ్చాత్య దేశాల్లోనే డార్వినిజం కూడా బాగా ప్రచారం కావడం వల్ల, అక్కడ ప్రధానంగా వున్న క్రైస్తవ మతానికి అది తలనొప్పిగా తయారైంది. అందువల్లనే అమెరికా వంటి దేశాల్లో యిప్పటికీ క్రైస్తవులు కొందరు డార్విన్ జీవపరిణామ వాదాన్ని ఎదుర్కొంటున్నారు. అది తప్పని రుజువుచేయడానికి శాస్త్ర పద్ధతులనే అనుసరిస్తున్నారు. అది ఒక పర్వం.

ఆ మధ్యకాలంలో కొన్నాళ్లు మతస్థులు డార్వినిజాన్ని కాదనలేని పరిస్థితిలో యిరుక్కుపోయారు. అందువల్ల 'డార్విన్ కూడా మతస్థుడే, ఆస్తికుడే' అనే వాదం లేవదీశారు. ప్రఖ్యాత శాస్త్రజ్ఞుల్ని మతస్థులుగా చిత్రించడం, ప్రసిద్ధనాస్తికులు తమ అవసాన కాలంలో పశ్చాత్తాపం (Confession) వెల్లడించారని ప్రచారం చేయడం మతస్థులకొక ఆచారంగా మారింది. "నిజానికి డార్విన్ పరిణామవాదం యేమి చెప్తున్నది? అది సరయినదవునా, కాదా" అనేది ప్రధానంకాని, "డార్విన్ మత నమ్మకాలేమిటి? ఆయన ఆస్తికుడా, నాస్తికుడా?" అనేది అంత ప్రధానంకాదు. గొప్పవాళ్లు చెప్పిన ప్రతివిషయాన్నీ మనం ఆమోదించలేము. ఒక శాస్త్రజ్ఞుడు యే శాస్త్రాంశంలో గొప్పవాడయితే ఆ శాస్త్రాంశంలో ఆయన అభిప్రాయాన్ని మన్నిస్తాం. అయితే డార్విన్ విషయానికివస్తే, ఆయన నాస్తికుడనే తేలుతుంది.

డార్విన్ జీవించివుండగా పెద్ద స్థాయిలో ఆయన మీద దాడి జరిగింది. ఆయన సభల్ని చెడగొట్టారు. తలెత్తుక తిరగడానికి వీలులేనంతగా అవహేళనలను ఆయన సహించవలసి

వచ్చింది. ఆయన తన తాత్విక విశ్వాసాలను స్వీయచరిత్రలో రికార్డుచేశాడు. ఆయన జీవిత కాలంలో అది అచ్చు కాలేదు. ఆయన మరణానంతరం ఆయన బంధువులు దాన్ని ప్రచురించారు. కొంతగా వారు మతస్థులు కావడం వల్లనూ. కొంతగా మత సమాజానికి భయపడడం వల్లనూ, వారు డార్విన్ స్వీయ చరిత్రలో కొన్ని భాగాలను ప్రచురించకుండా ఆపివేశారు. తర్వాత డార్విన్ మనుమరాలు నోరాబార్లో ఆ స్వీయ చరిత్ర నుంచి సెన్సార్ చేసిన భాగాలను కూడా కలిపి ప్రచురించింది. అందులో డార్విన్ మతం మీద వెల్లడించిన అభిప్రాయాలు చాలా స్పష్టంగా వున్నాయి. తన విశ్వాసాలూ, సంశయాలూ, అవిశ్వాసాలూ ఆయన దాచుకోలేదు. డార్విన్ వాక్యాలను యథాతథంగా చూస్తే, ఆయన క్రైస్తవం నుంచి అవిశ్వాసానికి, అజ్ఞేయవాదానికి, నాస్తికతకూ క్రమంగా నడిచినట్లు స్పష్టమవుతుంది.

"బేబెల్ గోపురం కట్టుకథను బట్టీ, 'ఇంద్ర' ధనుస్సు సూచన అనడాన్ని బట్టీ, కసితీర్చుకొనే క్రూరుడి స్వభావాన్ని దేవుడికి అంటగట్టడాన్ని బట్టీ, ప్రపంచాన్ని గురించి బైబిలు పాత నిబంధన యిచ్చిన తప్పుడు చరిత్రను నమ్మడానికి వీలు లేదని క్రమంగా నేను గ్రహించాను. అలా నిదానంగా అవిశ్వాసమనేది నాలోకి ప్రాకింది. చివరకు పూర్తిగా అవిశ్వాసినైనాను. నా నిర్ణయం తప్పని మరెన్నడూ క్షణకాలమైనా నాలో సంశయం కలుగలేదు. క్రైస్తవం సత్యమైనదని ఎవరైనా ఎలా అనుకోగలరో నాకు అర్థంకాదు. అది పరమ నికృష్టసిద్ధాంతం" అన్నాడు.

"I had Gradually come to see that Old Testament from its manifestly false story of the world, with the tower of Babel, the rainbow as a sign, and from its attributing to God the feelings of a revengeful tyrant was no more to be trusted..."

Thus disbelief crept over me at a very slow rate, but was at last complete ...... and have never since doubted even for a single second that my conclusion was correct. I can indeed hardly see how any one ought to wish Christianity to be true......

"And this is a damnable doctrine.......,,

డార్విన్ యెంతగా క్రైస్తవ మత వ్యతిరేకో, యింత కంటె రుజువేమి కావాలి?

అయితే డార్విన్ తాను ఆస్తికుణ్ణికానన్నాడు. అజ్ఞేయవాదిగా వుండంతో తృప్తిచెందుతానన్నాడు:

I for one must be content to remain an agnostic.

తాను నాస్తికుణ్ణి కానని అనలేదు. అజ్ఞేయవాది అంటే వాడు "తెలియదు" అనేవాడు. "దేవుడున్నాడా, లేడా?" అని అడిగితే "నాకు తెలియదు" అంటాడు. దేవుడున్నాడని చెప్ప లేని వాళ్ళంతా నాస్తికులే. అజ్ఞేయవాద సారాంశం నాస్తికత్వమే. వాళ్ళొకదశలో తమను తాము "అజ్ఞేయవాదులం" అని పిలుచుకున్నారు. దేవుడున్నాడన్న విశ్వాసం కలవాళ్ళు ఆస్తికులు. లేని వాళ్ళందరూ ఆస్తికులు కారు. ఆస్తికులు కాని వారినందరినీ మతాలు పాషండులు [Heretics] గా, నాస్తికులుగా పరిగణి

స్తాయి. అందుచేత ఎలా చూసినా డార్విన్ నాస్తికుడి క్రిందే లెక్క.

ఈ క్రింది వాక్యాలు పరిశీలించండి :

“మనోహర దృశ్యాలు చూచినప్పుడు నా మానసికానుభూతిలో కలిగిన అద్భుతభావన యిప్పటికీ కలుగుతూనే వుంది. అదెలాకలుగుతున్నది అనే ప్రశ్నకు సమాధానం చెప్పడం కష్టమైనప్పటికీ, దేవుడున్నాడనే వాదానికి దాన్ని ఆసరాచేసుకోడానికి వీలులేదు. అలాంటి భావన సంగీతం విన్నప్పుడు కూడా కల్గుతుంది. జీవులన్ని రకాలుగా వుండడానికి కానీ, ప్రకృతి వరణానికి కాని వెనుక ప్రచ్ఛన్న హస్తం (ఉద్దేశం) ఉన్నదనుకోవడానికి వీలులేదు. గాలి వీచినట్లే అదీ జరుగుతుంది. ప్రకృతిలో ప్రతిదీస్థిరమైన నియమాలకు ఫలితం. ఈ విశ్వాన్ని సృష్టించగలంత శక్తిమంతుడు, విజ్ఞాని ఉంటే కోట్లాది అధమజాతి జీవులు బాధపడటంలో అర్థంలేదు” అంటాడు.

The state of mind which grand scenes formerly excited in me, did not essentially differ from that which is often called the sènse of sublimity; and however difficult it may be to explain the genesis of this sense, it can hardly be advanced as an arguemet for the existence of God' ary more than the powerful though vague, and similar feelings excited by music.

There seems to be no more design in the variability of organic beings and the action of natural

selection, than in the course which the wind blows. Every thing in nature is the result of fixed laws...

A being so powerful and so full of knowledge as a God who could create the universe ...... it revolts our understanding to suppose that his benevolence is not unbounded, for what advantage can there be in the sufferings of millions of the lower animals......?

ఇలా డార్విన్ దేవుడిమీద తన నమ్మకంలేమిని అతి స్పష్టంగా వివరించాడు. ఇలా తమ నిర్ణయాలను చెప్పగలిగిన శాస్త్రజ్ఞులు కొందరే వుంటారు. అందువల్ల అలా చెప్పలేని శాస్త్రజ్ఞులంతా ఆస్తికులనుకోడానికి వీలులేదు. శాస్త్రజ్ఞుల్లో హేతువాదులూ, నాస్తికులూ, భౌతికవాదులూ యెక్కువ సంఖ్యలో వుంటారనేది నిస్సంశయం. అనేక కారణాలవల్ల చాల మంది తమ అభిప్రాయాలను బహిరంగంగా వెల్లడించలేరు.

—రావిపూడి వెంకటాద్రి.

# 3. నేను ఆస్తికుణ్ణా, నాస్తికుణ్ణా?

## చెప్పమంటున్నాడు చార్లెస్ డార్విన్

అక్టోబరు 1836జనవరి 1839 మధ్య రెండుసంవత్సరాలు మతాన్ని గురించి నేను ఎక్కువగా ఆలోచించేవాణ్ణి. బీగల్ ఓడ మీద ప్రయాణంలో వున్నంతకాలం ఛాందసంగానే వున్నాను.* ఏదో నైతికాంశం చర్చకువచ్చేది. నేను బైబిలు వాక్యాల్ని పరమ ప్రమాణంగా చూపేవాణ్ణి. ఓడలోని ఆఫీసర్లు కడుపుబ్బ నవ్వేవాళ్లు. నేను బహుశ కొత్త తరహాగా వాదించడం వారికి వినోదం కలిగిస్తూవుండేది. కానీ, క్రమంగా బైబిలు కథలు న మ్మ ద గి న వి కావని తేలింది. బేబెలు గోపురం, సూచక క్రియగా ఇంద్రధనస్సు, కసితీర్చుకున్న క్రూరుడుగా దేవుడిచిత్రణ, తప్పుడు ప్రపంచ చరిత్ర మొదలయిన కథలన్నీ హిందువుల మత గ్రంథాల్లోనూ, ఆటవికుల నమ్మకాల్లోనూ, వున్న కథల్లాంటివే. అప్పుడు నా మనస్సులో ఒక ప్రశ్న బయలుదేరింది; దాన్ని తీసివేద్దామంటే నా వ ల్ల కా లే దు. విష్ణువును, శివుణ్ణి వగైరాలను నమ్మమని హిందువులకు దేవుడే బోధించివుంటే, ఆ దేవుడే పాతనిబంధనలను కూడా నమ్మమని చెప్పివుంటాడా?—అలా జరిగివుంటుందని నాకు నమ్మకం తోచలేదు.

తర్వాత యింకా ఆలోచించాను. క్రైస్తవ మతానికి యెన్నో మహత్యాలు ఆధారభూతంగా వున్నాయి. వాటిని నమ్మాలంటే, తగిన రుజువుకావాలి. అది లేదు. ప్రకృతి నియమాలను యెంత యెక్కువగా మనం తెలుసుకొంటే, మహా

త్యాలు అంతనమ్మరానివిగా మారిపోతాయి. ఈ విషయం నేను గమనించాను. మత గ్రంథాలు రాయబడిన రోజుల్లోని మనుషులు అమాయకులు. వారిని వంచించడం తేలికగా సాధ్యమైంది. సంఘటనలు జరిగినప్పుడు సువార్తలు రాయబడలేదు. పొరపాటుగా కాకుండా ఉద్దేశపూర్వకంగానే సువార్తల్ని రాయడం జరిగింది. ఈ విధమైన అభిప్రాయం కొత్తదికాదు. మొత్తం మీద యిలాంటి అభిప్రాయాల ప్రభావం నా మీద పడింది. బైబిలు దేవుడి వాక్కుకాదు అనే నిర్ణయానికి నేను వచ్చాను. క్రైస్తవం మీద నమ్మకం సడలింది. ఇలాంటి తప్పుడు మతాలే ప్రపంచ మంతటా వ్యాపించాయనే అభిప్రాయం నాలో బలపడింది. కొత్తనిబంధనలో నీతిని గురించి యేదో కాదాచి వుందని అనుకుంటాం. అది వ్యాఖ్యానంలోనూ, అలంకారాల్లోనూ వున్నవసేకాని, నిబంధనలో యేమీ లేదు.

విశ్వాసాన్ని వొదులు కోడానికి నాకు బొత్తిగా యిష్టం వుండేదికాదు. ఎందుకంటే హంపిలోస్, మరొక చోటో యేవో విశేషాలు బయట పడ్డాయనే వారు. అవి సువార్తల్ని రుజువు చేస్తున్నాయనేవారు. అయితే అవికూడా నాలో విశ్వాసాన్ని నిష్టవేయించ లేక పోయినై. ఆ విధంగా నాలో మతం మీద అవిశ్వాసం తిన్నతిన్నగా ప్రాకింది. చివరకు పూర్తి అయింది. (Disbelief crept over me at a very slow rate, but was at last Complete'). నాకు బాధ అనిపించనంత నిదానంగా అవిశ్వాసం నాలో వ్యాపించింది. తర్వాత యేనాడయినా, ఒక్క క్షణమయినా, నా నిర్ణయాలు సరయినవి అవునా కాదా అన్న సంశయం నాకు నేరేదు. క్రైస్తవం

నిజమని యెవ్వరయినా యెలా అనుకోగలరో నాకు అర్థం కావడం లేదు. (I can indeed hardly see how any one ought to wish Christianiy to be true.) దాన్ని నమ్మని మా నాన్న సోదరుడూ, అనేక మంది ఆప్త మిత్రులూ, అంతా శాశ్వతంగా శిక్షించబడదారని బైబిలు స్పష్టంచేస్తుంది.

ఇది పరమ పాసిష్టి సిద్ధాంతం (And this is a damnable doctrine )

వ్యక్తిక దైవం గురించి చివరి రోజులదాకా నేను ఆలోచించలేను. అయినా కొన్ని నిర్ణయాలకు వచ్చాను. ప్రకృతిలో అంతా ఒకదిజైను ప్రకారం—ముందుగా వూహించి చేయబడినట్లున్నదని విలియంపాలీ ఒక వాదం పెట్టాడు. ఆ వాదం జీవశాస్త్రంలో చెల్లదు. మార్పులెన్నో ప్రకృతి వరణం ప్రకారం నిదానంగా యేర్పడుతూ వచ్చినై. వాటిని ఒక మేధానిధి సృష్టించాడనడానికి వీలులేదు. వున్నదంతా స్థిరమయిన నియమాల ఫలితమే. (Everything in nature is the result of fixed laws.)

ప్రపంచంలో చాలా దుఃఖంవుంది. దాన్నెవరూ కాదనరు. మనిషి నైతికాభివృద్ధికి తోడ్పడడానికే అది వుందని వాదించే వారున్నారు. ప్రపంచంలో తెలివికల జీవులు కోట్లాదిగా వున్నాయి. వాటితో పోల్చుకుంటే మనుషులసంఖ్య స్వల్పం. మరి ఆ జీవులన్నిటిలోనూ యీ నైతికాభివృద్ధిలేదు. ఇంత విశ్వాన్ని సృష్టించగలిగిన దేవుడు యెంతో శక్తివంతుడూ, పరిపూర్ణజ్ఞాని అయి వుండాలి. కొద్ది మనసుకల మనకు అతను పర్వేశుడు,

కావాలి. అతడు కరుణా మూర్తి కూడా కావాలి. మరి యీ అనంతకాలంలో, అనంతకోటి జీవరాసి యెందుకు బాధపడుతున్నట్లు? మేధాసంపన్నమయిన ఆదికారణానికి విరుద్ధంగా యీ బాధవుందా? నా దృష్టిలో యీ బాధ చాలా బలమయినది. వేరియేషన్, నేచురల్ సెలక్షన్ ద్వారా జీవులన్నీ అభివృద్ధి చెందడానికి కారణం యీ బాధలోనేవుంది.

అనుభూతి ద్వారా, ధ్యానంద్వారా మేధాసంపత్తికల దేవుణ్ణి తెలుసుకోవడం సాధ్యమవుతుందని కొందరు వాదిస్తుంటారు. మహమ్మదీయులూ, యితర మతాల వారూ అలానే వాదించవచ్చు. ఒకడో, చాలమందో దేవుళ్ళున్నట్లు వాదించవచ్చు. బౌద్ధుల్లాగా లేడనీ వాదించవచ్చు. మనం దేవుడనుకొనేటటువంటి దానిలో యే అటవికులకూ నమ్మకంలేదు. వాళ్ళు దయ్యాల్నీ, భూతాల్నీ నమ్ముతారు. ఆ నమ్మకాలెలా వచ్చాయో మనం వివరించుకోవచ్చు. ఆ పనిటైలరు, హెర్బర్ట్ స్పెన్సరు చేశారు.

నాలో మతభావం యెన్నడూ బలంగా వృద్ధిచెందలేదు. అయితే మొదట దేవుడు—ఆత్మవంటి వాటిమీద యేదో నమ్మకముండేది. బ్రెజిలియన్ అరణ్యం మధ్యలో నిలబడినప్పుడు "మనసులో కలిగే ఆశ్చర్యానికీ, అద్భుత భావనకీ, పారవశ్యతకీ సరయిన వివరణ యివ్వడం సాధ్యంకాదు," అని నేను నా వ[illegible]లో రాశాను. ఈ ప్రాణమన్నది కాక శరీరంలో మరేదో వుండేదని అనుకోనే వాణ్ణి. అది అప్పటి సంగతి. ఇప్పుడు అంత కంటె బ్రహ్మాండమయిన [illegible] లాంటి నమ్మకాలనీ, భావాలనీ [illegible] ది

A C No. 81165

వర్ణాంధుడి పరిస్థితి. "వున్నది" అనే నమ్మకం అందరికీ కలిగిస్తున్న మెరుపు (దేవుడు) లేనట్లు నాకు తోస్తుంది. అయితే యిక్కడ ఒక తేడావుంది. అన్ని జాతుల్లోని మనుషులంతా ఒకేరకమయిన దేవుణ్ణి నమ్ముతున్నట్లయితే, యీ వాదానికి అర్థంవుండేదే. కానీ పరిస్థితి అది కాదు. అందువల్ల ఏదివాస్తవంగా వున్నదో దానికి నమ్మకాలూ, లోలోపలి భావాలూ ఆధారం కాజాలవు, ఇంతకు ముందు రేపే దృశ్యాలు నామనసులో అద్భుత భావన కలిగించాయో, దేన్ని దేవుడి మీద నమ్మకంతో ముడివేయడం జరిగిందో అది దాదాపు పారవశ్యత లాంటిది. ఆ భావం ఎలా కలుగుతున్నదో మనం చెప్పలేక పోవచ్చు. కానీ, ఆ వాదం దేవుడున్నాడనడానికి చాలదు. ఎందుకంటె పారవశ్య భావం సంగీతం వల్ల కూడా కలుగుతుంది.

ఆత్మశాశ్వత మనేవాదవుంది. అదిచాలా బలమైనదే. సూర్యుడు, గ్రహాలూ చల్లబడి జీవులమనుగడ దుర్భరమై పోతుందనీ, మరొక పెద్దగోళం సూర్యుడితో ఢీకొని దానికి కొత్తవూపిరి యిస్తే తప్ప జీవంకొనసాగదని భౌతిక శాస్త్రజ్ఞుల మధ్య వున్న నమ్మకం లాంటిదే యిదన్నీ. మనిషి యిల్లాగే వుండిపోడని నా నమ్మకం. ఇంకా పరిపూర్ణతవైపు పెరుగుతాడు. అందువల్ల మనుషులంతా మున్ముందు నాశనమవతారని నేను అనుకోను. ఆత్మశాశ్వతమును కోసేవారికి ప్రపంచం నాశనమవుతుందనే భయం వుండనవసరంలేదు.

దేవుడి వునికిని గురించి నాకు మరొక బలమైన కారణం తోచేది: ఇంత బ్రహ్మాండ మయిన విశ్వం—ఇందులోని మనిషి—గతంలోకి, భవిష్యత్తులోకి చాలా దూరంగా చూడగల

గదం—యిదంతా కేవలం యాదృచ్ఛికమా? అని. అలా ఆలోచించినప్పుడు మనిషిలాంటి మేధస్సు కల ఆదికారణం ఒకటి వున్నదా? అని ఆలోచన వచ్చేది. ఆలోచన చేయడమంటే ఆస్తికుడ్ని కావడమే.

"జీవజాతుల ఆవిర్భావం" (Origin of Species) గ్రంథం రాసినప్పుడు యీ నిర్ణయం నాలో బలంగా వుండేది. క్రమంగా అది సన్నగిల్లి పోయింది. అయితే మళ్ళీ ఇంతగొప్ప నిర్ణయాలు చేయగలమనిషి మనస్సు క్రిందిజాతి జంతుదశ నుంచి వృద్ధి పొందిందా అని సంశయం వచ్చేది. ఇవన్నీ కార్య కారణ సంబంధానికి ఫలితాలు కావా? అయితే ఈ సందర్భంలో యితరుల అనుభవాన్ని మనం వారసత్వంగా పొందుతున్నాం. మెదడు పెరగని దశలో, పిల్లల మనస్సులో దేవుడమీద నమ్మకాన్ని యెక్కించడం వల్ల దాన్ని వాళ్ళు పెద్దయినతర్వాతయినా త్రోసివేయడం తేలికకాదు. పాముంటే కోతికి సహజాతంగావున్న భయాన్ని, ద్వేషాన్ని అది తోసివేయగలుగుతుందా? ఇది అంతే.

అంత గొప్ప విషయాలు నేను వివరించలేను. ఈ వస్తువులన్నీ యెలా పుట్టాయి? అనే ప్రశ్నను పరిష్కరించడం నా వల్లకాదు. అందువల్ల నేను అజ్ఞేయవాదిగానే వుంటాను.

వ్యక్తిక దైవంమీదా, స్వర్గనరకాలమీదా నమ్మకంలేనివాడు తనకున్న బలమయిన, వుత్తమమయిన ప్రేరణల్ని, సహజాతాల్ని బట్టి నడుచుకోవడమే కర్తవ్యం. కుక్క అంతే కదా? గుడ్డిగా అనుసరిస్తుంది. మనిషి అలా కాదే! అతను

ముందుకూ, వెనక్కూ చూచుకొంటాడు. అతని భావాల్ని, కోరికల్ని, జ్ఞాపకాల్ని పోల్చిచూచుకొంటాడు. తనకు ముందటి మేధావులు చెప్పినట్లుగానే సామాజిక వాసనలవంటి కొన్ని సహజ ప్రేరణల్ని అనుసరించడంవల్లనే జీవితంలో మంచి తృప్తిలభిస్తుందని గ్రహిస్తాడు. ఇతరుల మంచికోసం తాను కృషిచేస్తే, తోటివారి మెప్పు పొందుతాడు. తన సహచరుల ప్రేమను పొందుతాడు. అది అతనికి మహానందాన్ని యిస్తుంది. భోగలాలసత్వాన్ని అతను సహించడు. ఉత్తమ మయిన ప్రేరణలు అలవాటయి సహజాతాలుగా మారిపోతాయి. అతని వివేచన ఒక్కొక్కసారి యితరుల అభిప్రాయానికి వ్యతిరే కంగా నడవమని చెప్పవచ్చు. అప్పుడతను వారి మెప్పు పొందకపోవచ్చు. అయినా అతను తన అంతఃకరణను అనుస రించగలిగానన్న గట్టి తృప్తి పొందగల్గుతాడు. నావరకు నేను సక్రమంగానే నా జీవితాన్ని శాస్త్రంకోసం అంకితం చేశానను కొంటున్నాను. ఏ పాపమూ చేసిన పశ్చాత్తాపం నాకులేదు. అయితే నా తోటివారికి నేను చేయగలిగినంత మంచి చేయలే కపోయాననే చింత మాత్రం వుంది.

నా జీవితంలో చివరి సగభాగంలో హేతువాదం-సంశయ వాదం వ్యాప్తికావడం అత్యంత ప్రధానమైన విషయం. నా పెండ్లికి ముందు నా సంశయాల్ని జాగ్రత్తగా గోప్యంగా కట్టి పెట్టుకోమని మా నాన్న సలహాయిచ్చాడు. పెండ్లయిన వారి జీవితాల్లో అవి దుర్భర వేదనను కలిగించాయని చెప్పాడు. భార్యాభర్తలు ఆరోగ్యంగా వున్నంత వరకు యిబ్బందిలేదు. జబ్బుపడితే, తన భర్తరక్షణ పొందేది యెలాగా అని ఒకటే

గోల. దానితో భార్యకు సుఖంలేదు. మా నాన్న జీవితంలో ముగ్గురంటే ముగ్గురు అవిశ్వాసులయిన స్త్రీలను యెరుగునట. వారెవరని నే నడిగితే తన వదినె కిట్టీవెడ్జివుడ్ ఒకరని చెప్పాడు. ఎందుకంటే ఆమె స్పష్టమయిన అభిప్రాయాలు కలదట. నాకు తెలిసినంతవరకు మగవాళ్ళ కంటే ఆడవాళ్ళకే మతపిచ్చి యెక్కువఅని. మానాన్న అంటుండేవాడు. ఆయన అవిశ్వాసాన్ని గమనించిన షార్లోసటి అనేదట: "డాక్టర్, నా పొట్లో పంచదార తీయగా వుంటుందని నాకు తెలుసు. నా రక్షకుడు నాకు వుందనే వున్నాడు" అని.

(ఆత్మకథలో పై విధంగా తన తాత్వికాభిప్రాయాలను వెల్లడించిన డార్విన్‌ని ఆస్తికుడని ఎవరైనా అంటే, అలాంటి ఆస్తికుల్ని "నాస్తికులుగా. హేతువాదులుగా, స్వేచ్ఛావాదులుగా పరిగణించడానికి హేతువాదుల కెట్టి అభ్యంతరమూ వుండనవసరం లేదు.)

("డార్విన్ స్వీయచరిత్ర" నుంచి; ఛాయానువాదం,

—రావిపూడి వెంకటాద్రి.

# 4. ఛార్లెస్ డార్విన్ కారల్ మార్క్సు

1983 ఏప్రిల్ 19తో ఛార్లెస్ డార్విన్ శతవర్ధంతి సంవత్సరం ముగుస్తుంది. మార్చి 14తో కారల్ మార్క్సు శతవర్ధంతి సంవత్సరం ప్రారంభమవుతుంది.

డార్విన్ పేరు ఇవొల్యూషన్ (పరిణామం)కి, మార్క్సు పేరు రివొల్యూషన్ (విప్లవం)కి సంకేతాలైపోయినై. పరిణామ సిద్ధాంతాలూ, విప్లవ సిద్ధాంతాలూ వారిద్దరి కాలానికి చాలా పూర్వం నుంచీ వున్నై. కానీ, జీవపరిణామానికి డార్వినూ, సామాజిక విప్లవానికి మార్క్సూ నిర్దిష్ట సిద్ధాంత స్వరూపం ఇవ్వగలిగారు. అదీ వారి విశిష్టత.

డార్విన్ ప్రతిపాదించిన జీవజాతుల అవతరణకూ, నరావతరణకూ డార్వినిజమని హేళన ప్రాయంగా పేరు పెట్టిన వారు మతస్థులు. నిజానికి శాస్త్రజ్ఞుల పేరుమీదగా 'ఇజా' లను పేర్కొనడం శాస్త్రపద్ధతికాదు. డార్వినిజం అనే పేరు ఆ సిద్ధాంతంమీద మతస్థులకున్న జుగుప్సకు నిదర్శనం. ఇప్పటికీ మతస్థుల వైపునించి డార్వినిజంమీద దాడి జరుగుతూనే వుంది. కొన్ని వివరాల్లో విభేదించినప్పటికీ, శాస్త్రజ్ఞులెవ్వరూ, ఏనాడూ డార్వినిజంమీద దాడిజరిపినట్లు లేదు. డార్విన్ ప్రతిపాదించిన సిద్ధాంత ప్రాతిపదికల్ని శాస్త్రజ్ఞులంతా స్థూలంగా ఆమోదిస్తున్నారు. ఆయన తరువాత ఈ వంద సంవత్సరాల్లో జీవశాస్త్రం అటు భౌతిక విజ్ఞాన శాస్త్రాలతోనూ, ఇటు వారసత్వానికి సంబంధించిన జన్యు శాస్త్రంతోనూ వియ్యమం

దుకుంది. విశేషంగా అభివృద్ధిచెందింది. ఆ దృష్ట్యా డార్విన్ సిద్ధాంతంకూడా ఎన్నో మార్పులకు లోనై—ఎంతో పెరిగింది. కేవలం మానుషశాస్త్ర (యాంత్రోపాలజీ) అంశంగా బయలుదేరిన డార్విన్‌జం ఈనాడెంతో సంక్లిష్ట సిద్ధాంతంగా పెరిగిపోయింది.

బీగిల్ ఓడమీద ఖండఖండాంతరాలు పర్యటనచేసిన డార్విన్ ఎన్నో శిలాజాలను. జంతు—వృక్ష నమూనాలను పరిశీలించాడు. ఆ పరిశీలనమీదగా ఆయన చేసిన జిజ్ఞాస "జీవజాతులన్నీ ఒకదాని మీదుగా ఒకటి క్రమంగా పరిణామం చెందినవే కాని, ఒక్కసారిగా యే దైవం చేతనో సృష్టించ బడినవి కావు" అనే నిర్ణయానికి రావడానికి తావిచ్చింది. తత్ఫలితంగా ఆయనకు బైబిలుమీద, మతంమీద, దైవంమీద నమ్మకం సడలింది. డార్విన్ జీవపరిణామాన్ని గురించి శాస్త్రీయ దృక్పథంతో వెల్లడించిన భావాలు బైబిలు యొక్క సృష్టివాద పునాదుల్ని కదిలించాయి. కాబట్టి, తొలి నుంచీ మతస్థులు డార్విన్ సిద్ధాంతాన్ని తీవ్రంగా యెదుర్కొంటూ వచ్చారు. మధ్యకాలంలో కొంత వెనుకంజ వేసినా, తిరిగి యిప్పుడు అమెరికాలోని ఫండమెంటలిస్టులూ, ఆడమిస్టులూ వగైరా—అరబ్ దేశాల ముస్లిములూ డార్విన్ సిద్ధాంతంమీద రాజ్యాంగపరంగా దాడి ప్రారంభించారు. డార్విన్ ప్రతిపాదనలను యథాతథంగా కాకపోయినా, కొన్ని మార్పులతో అంగీకరించదగిన సిద్ధాంతంగా శాస్త్రజ్ఞులంతా ఆమోదిస్తారు. "జీవపరిణామం జరిగింది; సృష్టి జరగలేదు" అన్న భావాన్ని చదువుకొన్న వారందరి మనస్సులకు హత్తుకొనే విధంగా ఆ

సిద్ధాంతాన్ని తీర్చి దిద్దడం డార్విన్ గొప్పతనం. అందుకా యనకు తరతరాల మానవజాతి జోహారులర్పించక తప్పదు.

జీవజాతులు పరిణామం చెందుతున్నట్లే, మానవ సమాజంకూడా అనేక దశలు మారుతూ వస్తున్నదన్న సత్యాన్ని వెలువరించిన సామాజిక శాస్త్రజ్ఞులు మార్క్స్‌కు పూర్వం చాల మంది ఉన్నారు. కాని, మార్క్స్‌వలె ఆ ఆలోచనలకు స్పష్ట మయిన క్రమబద్ధరూపాన్నియిచ్చి, ఆ మార్పుకు కారణాలు జతచేసిన వారులేరు. ఆ పనిచేసిన ఘనత మార్క్స్‌ది. పెట్టుబడి దారీ విధానంవల్ల బయలుదేరిన పీడనకు మార్క్స్ వైజ్ఞానికంగా ప్రతిస్పందించాడు. సామాజిక పరిణామంలో దాని అంతం అనివార్యమని గ్రహించాడు. విప్లవాలవల్ల జరగవలసిన ఆ మార్పుకు చారిత్రికనియతి ప్రత్యేక పద్ధతుల్ని నిర్దేశించినట్లు సూత్రీకరించాడు. నాస్తికుడిగా, భౌతికవాదిగా బయలుదేరిన మార్క్స్ చారిత్రక పరిణామ రీతుల్ని అధ్యయనంచేసి, దాని మార్గాన్ని కనుగొనడానికి జీవితాన్ని అంకితం చేశాడు. ఆయన నిర్దేశించిన మార్గాన్నే చరిత్ర నడవలేదు. ఆయన ఊహకు అందరాని మార్పులెన్నో శాస్త్రీయ, సాంకేతిక, చారిత్రక రంగాల్లో జరిగినై. ఫలితంగా మార్క్సిజం పేరుమీదుగా విప్లవ సిద్ధాంతాలు చీలికలైనై. అయినప్పటికీ ఆర్థిక సమతాదృక్పథాన్ని, సామాజిక న్యాయాన్ని ప్రముఖంగా లోకం దృష్టి లోకి తెచ్చిన ఘనత మార్క్స్‌కు దక్కుతుంది. అందుకాయనకు మానవజాతి జోహారులర్పిస్తుంది.

భౌతిక విజ్ఞానశాస్త్ర విషయాల్లో చేయగలిగినంత నిక్కచ్చిగా జీవశాస్త్రాల్లో సూత్రనిర్మాణం చేయడం కష్టం. అయినా

చేయటతప్పదు కాబట్టి చేస్తూనే వుంటాం. జీవశాస్త్రంలో సూత్రీకరించగలిగినంతనిక్కచ్చిగా సామాజికశాస్త్రవిషయంలో నిర్ణయాలు చేయడం కష్టం. అయినా మార్గదర్శకత్వం కోసం సూత్రీకరణచేసుకొంటూ, ఆచరణలో వచ్చే ఎగుడు దిగుడులను బట్టి వాటిని సవరించుకొంటూ, నూతన సూత్రీకరణచేసుకొంటూ మానవజాతి పురోగమిస్తుంది. కాబట్టి ఆలోచన ఆచరణను నడపాలనీ, ఆలోచనలను సవరించేది [కరెక్టివ్]గా ఆచరణ పనిచేయాలనీ—అలా మానవజాతిలో ఆలోచన-ఆచరణలు నిత్య పరిణామం చెందుతూవుంటాయనీ చరిత్ర మనకునేర్పుతుంది. ఏ సిద్ధాంతమైనా దాని సూత్రకారుడు ప్రతిపాదించిన రీతిలో యథాతథంగా, అపరిణతంగా కొనసాగదు. అలా కొనసాగినవన్నీ మతాలై పోయినై. శాస్త్ర సిద్ధాంతమేదీ వరమంకాదు. నిర్మాణంలోనో, అన్వయంలోనో—మొత్తంగానో, పాక్షికంగానో శాస్త్రీయ సిద్ధాంతాలు నిత్య పరిణామం చెందుతూనేవుంటాయి. ఆ విషయం భౌతిక శాస్త్రాలకంటె జీవశాస్త్రాల్లో, జీవశాస్త్రంలో కంటె సామాజిక శాస్త్రంలో ఎక్కువ నిజం. అందుకుగల కారణాలనూకూడా శాస్త్రవిజ్ఞాన పరిధిలోనే మనం వివరించుకోవచ్చు. మానవ మనోవిజ్ఞాన శాస్త్రం (సైకాలజీ) శైశవంలోవున్న యీ చారిత్రక దశలో మానవుడి భవిష్యత్ చరిత్రను గిరిగీచి శాసించడం సాధ్యంకాదు.

మార్క్సుకాలంలో మార్క్సు సిద్ధాంతాలమీద దాడి జరిగింది. లెనిన్ కాలం నుంచి ఆ సిద్ధాంతాలకు ప్రచారం జరిగింది. ఇప్పుడు మార్క్సు సిద్ధాంతాలమీద అధ్యయనం జరుగుతున్నది. "మానవుడే మానవజాతికి మూలం" (For man, the root is man himself) "ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా అభివృద్ధి చెందగలిగితేనే అందరూ స్వేచ్ఛగా

అభివృద్ధి చెందగల్గుతారు" (the free development of each is the condition for the free development of all)" అన్న మార్క్సిస్టు సూత్రాలను వ్యాఖ్యపరిచే విధంగా ఆయన సిద్ధాంతాల ఆచరణ జరుగుతున్నట్లు ఈనాటి ప్రపంచ మేధావులు అభిప్రాయ పడుతున్నారు. [illegible] మార్క్సును తెరచాటుకు పంపించి, విప్లవమార్క్సును మీదకు ఎక్కించినట్లు భావిస్తున్నారు. మార్క్సు ఎక్కడ ఒప్పు (right) అక్కడ అనుసరించ బడడంలేదని, ఎక్కడ తప్పు (wrong) అక్కడ అనుసరించబడుతున్నాడనీ వక్కాణిస్తున్నారు. డార్విన్ 'జీవనపోరాటం (struggle for existence), సర్వోత్తమమైన వాటి మనుగడ' (survival of the fittest), అనే సిద్ధాంతాలు మార్క్సును ఎంతవరకు ప్రభావితం చేశాయి నేది ప్రత్యేక పరిశీలనాంశం. అయితే డార్విన్ పేరుతో ఫాసిస్టు నియంతృత్వమూ, మార్క్సు పేరుతో కమ్యూనిస్టు నియంతృత్వమూ ముఖీవడి సమర్థన పొందడం చాలా విచారించదగిన విషయం. వారి సిద్ధాంతాల తాత్వికధ్వనులు ఆయా రాజకీయ సిద్ధాంతాలకు—తదాచరణకూ దారితీస్తాయనడం కేవలం యుక్తీకరణమే. వారి యిరువురిలోనూ వున్న హేతువాద మానవవాద పోకడల్ని వెలుగులోకి తీసుకువచ్చి సమాజ పోకడల్ని అర్థవంతం చేయడం నేటి మానవుడి బాధ్యత. ఏదేమైనా —డార్విన్, మార్క్సు ప్రతిపాదించిన సిద్ధాంతాలు వాటి యథాతథరూపంలో నిలవకపోయినా వాటిని "అధ్యయనంచేసి, అవగాహనచేసుకొని, వాస్తవిక శాస్త్రీయ పునాదులమీద సమస్యలకు పరిష్కారమార్గాలు కనుగోవడం మన కర్తవ్యం.

రావిపూడి వెంకటాద్రి

# 5. మార్క్సు కాపిటల్ డార్విన్ కి అంకితం

## ఇస్తానంటే వద్దన్న మాట వాస్తవం కాదు.

వదంతులు, పుకార్లు, కట్టుకథలు వ్యాపించడానికి మంచి చెడులతో నిమిత్తం లేదనిపిస్తుంది. నిజమైనా, అబద్ధమైనా ఒకవార్త ఆసక్తిదాయకమైనదైనప్పుడు ఒక నోటి నుంచి ఒక చెవికి—ఆ నోటినుంచి మరొక చెవికి వ్యాపించేటప్పుడు అవశ్యంగా కొంత అబద్ధాన్ని మోసుకెళ్లుతుంది. ఆయా వార్తల పట్ల వ్యక్తులకున్న మోజు, అభిలాషే అందుకు కారణమేమో ననిపిస్తుంది.

మార్క్సు (కమ్యూనిజం గురించి కాక) పెట్టుబడిని గురించి వ్రాసిన "కాపిటల్" అనే గ్రంథాన్ని చార్లెస్ డార్విన్‌కి అంకిత మిస్తానన్నాడనీ, కానీ, డార్విన్ అంకితం తీసుకోడానికి అంగీకరించలేదనే ఒక కథ ప్రచారంలో వుంది. నిజానికి ఆ కథ అపార్థం ఫలితంగా వ్యాపించిన కట్టుకథే.

డార్విన్ 19 ఏప్రిల్ 1882న మరణించాడు.

మార్క్సు 14 మార్చి 1883న మరణించాడు.

మార్క్సు 16 జూన్ 1873న డార్విన్‌కి తన కాపిటల్ గ్రంథంయొక్క మొదటి జర్మన్ ఎడిషన్‌ని కాక రెండవ ఎడిషన్ ఒక ప్రతిని పంపించాడు. దానికి సమాధానంగా 1 అక్టోబరు 1873న డార్విన్ వ్రాసిన లేఖలో ఆ గ్రంథపు విషయం తనకు

సరిగా అవగాహనకానందుకు క్షమించమన్నాడు అంతటితో ఆ కథ ముగిసింది. ఆపత్తర ప్రత్యుత్తరాల్లో ఎక్కడా అంకితం ప్రసక్తి రాలేదు. పైగా మార్క్స్ కాపిటల్ ప్రథమ ముద్రణ 1867లో జరిగింది. అప్పుడు ఒరగని అంకితం ప్రసక్తి రెండవ ముద్రణలో ఎలా వస్తుంది? 1867 లోనే మార్క్స్ తన గ్రంథాన్ని విల్‌హెల్మ్‌వుల్ఫ్‌కి అంకితమిచ్చాడు. 67 లో ఒకరికి అంకితమయిన పుస్తకాన్ని 73 లో పరొకరికి అంకితమివ్వాలనే ప్రతిపాదన మార్క్స్ నుంచి వచ్చిందని కానీ, అందుకు డార్విస్ నిరాకరించాడని కానీ, ఆలోచించడం వివేకవంతం కాదు. మనకు యెంత ఆసక్తికరమయినా, అబద్ధాలకు ప్రచారం యివ్వడం ఆరోగ్యకరం కాదు.

మార్క్స్ జీవించివుండగా కాపిటల్ రెండవభాగం ముద్రణకాలేదు. చిందరవందరగా వున్న ఆ గ్రంథానికి ఆ రూపం యిచ్చి 1885లో ముద్రణలోకి తెచ్చినవాడు ఫ్రెడరిక్ ఏంగిల్స్. అందులో ఎవరికిగానీ అంకితం యివ్వడం ప్రసక్తిలేదు.

ఐతే యీ కట్టుకథ యెలా వ్యాపించింది? అనేది ప్రశ్న.

డార్విన్ క్రమక్రమంగా నాస్తికుడైనాడు. మతానికి బాగా దూరమైనాడు. పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదించడం మూలంగా మతస్థుల దూషణ తిరస్కారాలనూ, దురభిమానాన్నీ రుచిచూచాడు. అందువల్ల తన జీవిత కాలంలో మతం మీద తన అభిప్రాయాలను బాహటంగా ప్రచారంచేయడానికి జంకాడు. ఆయన స్వీయచరిత్రలో క్రైస్తవ మతానికీ, ఆస్తికత్వానికీ వ్యతిరేకంగా ఆయన చాలా విస్పష్టమయిన అభిప్రాయం వెలిబుచ్చాడు. 'అయినా ఆ అభిప్రాయాలను

పెన్నార్దు చేసి ఆయన స్వీయ చరిత్ర ప్రచురించబడింది. తర్వాత చాలా కాలానికి ఆ భాగాలు ఆయన స్వీయచరిత్రలో కలిపి ముద్రించడం జరిగింది. అలా చేయడానికి డార్విన్ మనుమరాలు చాలా ధైర్యం చేయవలసి వచ్చింది. డార్విన్ కుమారులు, వారసులు అంతా హేతువాదులు కావడంవల్లనే అది సాధ్యమైంది.

డార్విన్ జీవిత కాలంలోని పరిస్థితి అదికాదు. డార్విన్‌ని మాత్రమే కాక అతని కుటుంబీకుల్ని, బంధువుల్ని కూడా ఆనాటి ఇంగ్లీషు మత సమాజం వెలివేయబడినవారుగా పరిగణించేది. తనద్వారా తన కుటుంబం వారు బాధపడడం డార్విన్ భరించలేక పోయాడు. అలాంటి తరుణంలో ఎడ్వర్డ్ ఎవెలింగ్ అనే ఆయన "విద్యార్థుల డార్విన్" (Students' Darwin) అనే పుస్తకం వ్రాశాడు. క్రైస్తవ మతభావాలు యెలా అశాస్త్రీయాలో డార్విన్ పరిణామ సిద్ధాంతంవల్ల తెలుతుందని అందులో ఎవెలింగ్ వివరించాడు. ఆ గ్రంథాన్ని డార్విన్‌కి అంకితం చేయ్యాలని సంకల్పించి ఎవెలింగ్ డార్విన్ అనుమతికోసం 12-10-1880న ఒక లేఖ వ్రాశాడు. దానికి సమాధానంగా (మరు నాడు) 13 అక్టోబరు 1880న డార్విన్ ఎవెలింగ్‌కి వ్రాసిన పుత్రాన్ని మార్క్స్‌కు వ్రాసిందిగా ఎవరో ఒక మహామహుడు ఒక వార్త గాలిలోవదిలాడు. ఆ పుత్తరం యెవరికి వ్రాసిందో, ఎప్పుడు వ్రాసిందో, అందులో యేమని వ్రాసివుందోకూడా పట్టించుకోకుండా ఆ వార్తకు ప్రచారం జరిగింది. దేవుళ్ళూ, వ్యక్తులూ సిద్ధాంతాలూ యిలాగే ప్రాథమిక అవగాహనకూడా లేని వారిచేత ప్రచారం చేయబడడం వల్లనే మత తత్వానికి చిరాయువు కల్గుతూ వుంది.

అయితే డార్విన్ ఎవెలింగ్‌కి వ్రాసిన పత్రంలో యేమి వుంది :—

Dear Sir,

I am much obliged by your kind letter and enclosure. The publication in any form of your remarks on my writings really requires no consent on my part and it would be ridiculous in me to give consent to what required none. I should prefer the part or volume not to be dedicated to me (though I thank you for the inteded honour) as this implies to a certain extent my approval of the general publication, about which I know nothing. Moreover though I am a strong advocate for free-thought on all subjects, yet it appear to me (whether rightly or wrongly) that direct arguments against Christianity and theism produce hardly any effect on the public; and freedom of thought is best promoted by the gradual illumination of men's minds, which follow from the advance of science. It has, therefore, been always my object to avoid writing on religion, and I have confined myself to science. I may, however, have been unduly biassed by the pain which it would give some members of my family, if I aided in anyway direct attacks on religion. I am sorry to refuse you any request, but I am old and have very little

strength and looking over proof sheets (as I know by present experience) fatigues me much.

I remain,
Dear Sir,
Yours faithfully
Ch. Darwin

(Quoted by Nicholas walter in "New Humanist," Winter, 1981)

ఈ లేఖ భావం :— మీ లేఖ, దానితో జతపరచ [illegible] కాలకు కృతజ్ఞుణ్ణి. నా రచనల మీద యే రూపంలోనైనా మీ వ్యాఖ్యానాలు ప్రచురించుకోడానికి నా అనుమతి అవసరంలేదు. అవసరంలేని అనుమతిని నేనివ్వడం హాస్యాస్పదం. మీ గ్రంథాన్ని మొత్తంగాకాని, అందులో భాగాన్ని కాని నాకు అంకితం చేయకుండా వుండడమే నా యిష్టం. (మీరు నాకిస్తానన్న గౌరవానికి కృతజ్ఞుణ్ణి). అంకితాన్ని అంగీకరించాలంటే కొంతగా మీ రచనని నేను ఆమోదించాలి. దాన్ని గురించి నాకేమీ తెలియదు. పైగా, అన్ని అంశాల మీదనూ నేను స్వేచ్ఛా జిజ్ఞాస (హేతువాదం) కావాలని బలంగా కోరేవాణ్ణయినా, (అది మంచి కానీ, చెడు కానీ) క్రైస్తవ మతానికీ, ఆస్తికత్వానికీ వ్యతిరేకంగా బహిరంగ చర్చలేవదీయడం ప్రజలమీద ఏలాంటి మంచి ప్రభావమూ చూపదు. మనుషుల మనస్సుల్ని క్రమంగా వికాసవంతం చేయడంవల్ల స్వేచ్ఛాజిజ్ఞాసను బాగా పెంపొందించవచ్చు. విజ్ఞాన శాస్త్రాభివృద్ధి మాత్రమే నా లక్ష్యం. నేను శాస్త్రం వరకే పరిమితం చేసుకొన్నాను. మతం మీద బహిరంగంగా జరిగే దాడులకు నేను సహకరిస్తే, మా

కుటుంబంలోని కొందరు సభ్యులకు బాధకలిగిస్తుందన్న భావం
వల్ల నేనీ నిర్ణయానికి వచ్చివుండవచ్చు. ఏమైనా మీ అభ్యర్థన
తిరస్కరించవలసి వచ్చినందుకు నేను విచారిస్తున్నాను. నేను
ముసలివాణ్ణి. బలంలేదు. మీ కాగితాలు చదివే అలసటను నేను
భరించలేను."

కాపిటల్ గ్రంథం మతానికి, ఆస్తికత్వానికి వ్యతిరేకంగా
వ్రాసింది కాదు. డార్విన్ సిద్ధాంతాలకు మత వ్యతిరేక
నాస్తిక వ్యాఖ్యయిస్తూ వ్రాసిందికాదు. అందులో మతంమీద
బహిరంగ దాడి యేమీలేదు. ఫుట్‌నోట్సులో మాత్రమే మూడు
నాలుగు చోట్ల డార్విన్ ప్రస్తావన కాపిటల్‌యొక్క రష్యన్
ఎడిషన్‌లో కనిపిస్తుంది. డార్విన్ వుత్తరాన్ని ఒట్టి ఆయనకు
అంకితమివ్వదలచుకొన్న గ్రంథం డార్విన్ పరిణామ సిద్ధాంతం
ఆధారంగా క్రైస్తవ మతంమీదా, అస్తికత్వంమీదా బహిరం
గంగా దాడి జరిపిందని తెలుస్తుంది. కాబట్టి మార్క్స్ కాపిటల్
డార్విన్‌కి అంకితం యివ్వదలిచాడన్న వార్తలో నిజం లేదు.

రావిపూడి వెంకటాద్రి

# 6. "బైబిలు భక్తుల కోతిచట్టం"

ఇది యిరవయ్యో శతాబ్దమేనా? ఈ శతాబ్దపు మనిషి అణుగర్భాన్ని చీల్చి అమేయశక్తిని విడుదలచేసిన విషయం నిజమేనా? రోదసీ గహ్వరంలో జొరపడి గ్రహాంతరయానం చేసిన సంగతి నిజమేనా? సృష్టికి ప్రతిసృష్టిచేస్తూ, వారసత్వ (Heriditary) కణాల స్వభావాలను మార్చి నూతనజాతుల సృష్టితో పరిణామగతిని మార్చడానికి ప్రయత్నిస్తున్న మాట నిజమేనా?—?

ఔను-నిజమే. మనకు నిజమే. మనుషులకు యిదంతా నిజమే కాని, తనలోని మనిషిని అవతలకునెట్టిన మూఢమతస్తులకిదంతా ఒక భ్రమ.

దేవుడనేవాడొకడు మట్టితోనో, లేక మరొక దానితోనో తన ఆకారంలో బొమ్మనుచేసి ఉఫ్ అని గాలి ఊదితే మనిషి అయ్యాడనేది దాదాపు అన్ని మతాల సృష్టి దృక్పథం. ఐతే జీవోత్పత్తి, పరిణామం స్వభావసిద్ధంగా జరిగేవేకాని దైవ సృష్టికావు అనే స్వభావవాద ఆలోచనకూడా చిరకాలంగా వుంది. ఐనా, మతస్తులెన్నడూ యీ రకమైన వాదాన్ని ఆమోదించనూ లేదు. అంతగా పట్టించుకోనూలేదు.

కానీ, గతశతాబ్దంలో ఛార్లెస్ డార్విన్ (1803-82) జీవజాతులు క్రమంగా క్రిందినుంచి పరిణామంచెంది చివరకు తెలివికల రెండుకాళ్ళ కోతివంటి జాతినుంచి మనిషి వచ్చాడని అనేక ఆధారాలతో, రుజువులతో జీవపరిణామ సిద్ధాంతాన్ని, మనిషి అవతరణనీ శాస్త్రీయ దృక్పథంతో వివరించాడు. ఆయన

వ్రాసిన 'జీవజాతుల ఆవిర్భావం' (1859) 'మానవుని అవతరణ' (1871) అనే గ్రంథాలు పరిణామ సిద్ధాంత ప్రతిపాదనలో డార్విన్ నాటిన మైలురాళ్ళు.

ఐతే.... కోతులు మన తాతలా ? అని నామోషీతో తిరుగుబాటు చేశారు మతస్థులూ, ఆ వాసనగల శాస్త్రజ్ఞులూ. జనాన్ని రెచ్చగొట్టారు. సభల్లో డార్విన్‌మీద కోడిగుడ్లూ, పేడసుద్దలూ కొట్టి నిజంగానే కొండ ముచ్చుల వారసులమని రుజువు చేసుకున్నారు. కాని, థామస్ హెన్రీహక్స్‌లే (1825-95), యెర్నెస్ట్ హెకెల్ (1834-1906) ప్రభృతులెందరో వరువుగల శాస్త్రజ్ఞులు డార్వినుకు అండగా నిలిచి, మతస్థుల తీవ్రమైన దాడిని తిప్పికొట్టారు. మొత్తంమీద దేవుడు మట్టిబొమ్మనుచేసి గాలి ఊదితే మనిషి అయ్యాడనేమాట అబద్ధమనీ, పరిణామఫలితంగా మానవుడేర్పడ్డాడనే వాదంలో నిజముందనీ ఒక అభిప్రాయం ప్రజల్లో ప్రబలిపోయింది.

ఐనా, మతస్థుల బుర్రల్లోవున్న దేవుడూరుకోలేదు. లుకలుక పురుగు తొలిచినట్లు తొలుస్తూ వున్నాడు. తత్ఫలితంగా పరిణామ సిద్ధాంతం కోర్టుపాలై బోనెక్కవలసి వచ్చింది.

నిజానికి మధ్యయుగానంతరం యూరపులో చాలా మంది శాస్త్రజ్ఞులు (భిన్న మతావలంబులుకూడా) హోమలూ యెక్కారు. మండుతున్న చితులూయెక్కి భస్మమయ్యారు. ఐతే, మతస్థులు ఆశించిన రీతిగా శాస్త్రజ్ఞులతో పాటు శాస్త్రంకూడా భస్మంకాలేదు.

అలాగే అమెరికాలోని మత పన్యాసులు పరిణామ సిద్ధాంతాన్ని కూడా 'మంకీలా' పేరుతో బోనెక్కించి, పరిణామ

వాదుల్ని శిక్షిస్తే, యిక ఆ సిద్ధాంతం అంతర్ధానమైపోతుందని నమ్మారు. కానీ, వారి నమ్మకం వమ్మయిపోయింది. వారి విశ్వాస రక్షణకోసం కాకపోయినా, కనీసం తన (సృష్టి) హక్కు రక్షణ కోసమయినా దేవుడు దిగిరాలేదు. ఐనా, మతస్థులకు బుద్ధిరాలేదు. ఇంతవరకూ అమెరికా క్రైస్తవుల ఆగడం ఆగనేలేదు. పరిణామవాద ప్రబోధాన్ని నిరోధించే ప్రయత్నాలు 1963లో కూడా జరుగుతూనే వున్నాయి. విజ్ఞానాన్ని నాశనంచేసి, బైబిల్ని కాపాడుకోవడమే వారి ఆశయం.

అసలు 19వ శతాబ్ది అర్ధభాగంలో అమెరికా క్రైస్తవుల్ని చీకాకు పరిచే సంఘటనలు యూరపులో జరిగై. యూరపులోని పండితులూ, మేధావులూ బైబిలును పట్టుకొని ఊకకు ఊక....తోకకు తోక పీకి, అది దైవవాక్కు కాదనీ, పాతకాలపు కట్టుకథల పుట్ట—పుక్కిటి పురాణాలబుట్ట అని తేల్చారు. దానితో మతస్థులకు తేళ్ళు జెర్రులు పారాడినట్లయింది. బైబిల్లో వున్న కట్టుకథల్ని యే విధంగానూ తొలగించలేరు—కాబట్టి, పరిణామవాదాన్నే కట్టుకథగా నిరూపించాలని ప్రయత్నాలు ప్రారంభించారు.

అమెరికన్ క్రైస్తవ మతశాఖల్లోని ఫండమెంటలిస్టులూ, అడమిస్టులూ తమ ఉద్యమాలను ఉధృతంచేశారు. పరిణామవాదాన్ని దూషిస్తూ ప్రచార సాహిత్యాన్ని పరిచివేశారు. ఐనా ఆధునిక విజ్ఞాన వాసనలు సోకిన యువతరానికి మతస్థుల వైఖరి అసహ్యనశీలమైంది. శాస్త్ర బద్ధమైన, హేతుబద్ధమైన పరిణామవాదాన్ని కాదనలేక పోయారు. ఫలితంగా పరిణామవాదం బలం చేకూర్చుకోజొచ్చింది.

ఇక మతస్థులు ఓర్పు వహించలేకపోయారు. దాన్ని నిరోధించటానికి రాజ్యాంగాన్నీ, చట్టాన్నీ ఆశ్రయించటానికి వ్యూహం పన్నారు.

1925లో జాన్ వాషింగ్టన్‌బట్లర్ అనే రైతు ప్రతినిధి అమెరికాలోని టెన్నెస్సీ రాష్ట్ర శాసన సభలో పరిణామవాద వ్యతిరేక బిల్లు ప్రవేశపెట్టాడు.

చర్చలేకుండా ఆ బిల్లు దిగువ, ఎగువ సభలు రెంటి లోనూ ఆమోదించబడిందంటే ఆనాటి ప్రజా ప్రతినిధుల మేధాశక్తి, విజ్ఞానమూ, వివేకమూ, నిజాయితీ ఎంతటి దౌర్భాగ్యస్థితికి దిగజారాయో అర్థమవుతుంది.

మార్చి 21న గవర్నరు సంతకం పడింది, బిల్లు చట్టమై పోయింది. అంతే. ఇక పరిణామవాదం బోధించటమే నేరమై పోతున్నదన్నమాట!

దీనితో అమెరికా పౌర హక్కుల సంఘం కదిలింది. (అమెరికాలో మతస్థులే కాకుండా మనుషులుకూడా ఉన్నారనే విషయం మనం మరువరాదు.) బట్లర్‌యాక్టు రాజ్యాంగ బద్ధతను ప్రశ్నించే వారికయ్యే కోర్టు ఖర్చులు తామేభరించగల మని ఆ సంఘం ఏప్రిల్ 4న ప్రకటించింది.

ఈ ప్రకటనలు చూచిన ముగ్గురు డేటన్ నగర మిత్రులు నిజంగానే ఆ చట్టంయొక్క రాజ్యాంగబద్ధతను పరీక్షించటానికి సిద్ధమయ్యారు. అందులో జార్జిరాప్లీయా అనే వ్యాపారస్తుడు పరిణామవాదానికి అనుకూలంగానూ, సూ హిక్స్ అనే న్యాయ వాది, వాల్టర్‌వైట్ అనే విద్యాశాఖోద్యోగి వ్యతిరేకంగానూ వ్యవహరించడానికి నిర్ణయించుకొన్నారు.

జాన్‌థామస్‌స్కోప్స్ అనే 24 యేండ్ల హైస్కూలు సైన్సు అధ్యాపకుడు వైట్, హిక్స్‌లకు, మిత్రుడు. నేరస్థుడి పాత్ర నిర్వహించడానికి అతణ్ణి వారు ఒప్పించారు. (టెస్టుకేసు కదా). నేరారోపణ జరిగింది. స్కోప్సు మీద వారంట్లు పడిపై. ఫిర్యాది, ముద్దాయీలమధ్య లాలూచీ ఉన్నా, వ్యవహారంలో మాత్రం లాలూచీలేదు. ఎందుకంటే అసలు బట్లర్ మంకీలా చెల్లుతుందో చెల్లదో కోర్టు పరంగా తేల్చుకోవాలి. ఈ రహస్యం న్యాయమూర్తికీ, జూరర్లకూ, న్యాయవాదులకూ తెలియదు. అంతా సీరియస్ గానే జరిగిపోతూ ఉంది.

ప్రాసిక్యూషన్ తరపున ప్రసిద్ధ ఆదమిస్టు, పరిణామ వాద విరోధి విలియం జెన్నింగ్స్ బ్రయెన్ ఫీజులేకుండా వాదించడానికి తలపడ్డాడు. ఇక స్కోప్స్ పక్షాన ప్రసిద్ధ అజ్ఞేయవాది క్లారెన్స్ డారో ఫీజులేకుండానే వాదించటానికి సిద్ధపడ్డాడు. మిగతా న్యాయవాదులంతా రెండు ముఠాలైనారు.

జూలై 10న విచారణ ప్రారంభమైంది. వందమంది పత్రికా విలేఖరులు కూడారు. జనం కోతుల గుంపుల్లాగా, నోళ్లు తెరుచుకొని మెలదొక్కుకుంటున్నారు. కొంపలంటుకొని పోతున్నట్లుంది.

జడ్జి జాన్‌రాల్‌స్టన్ ఫండమెంటలిస్టు చర్చికి చెందినవాడు. పరిణామవాదంలో సత్యాన్ని రుజువు చేయటానికి డారో అనేక మంది శాస్త్రజ్ఞుల్ని, పండితుల్ని సాక్షులుగా పిలిపించుకొన్నాడు. కాని రాల్‌స్టన్ ఆ సాక్షుల్ని విచారించటానికి అనుమతించలేదు. డారో తూలిమాట్లాడినా, కోర్టు ధిక్కరణ అవుతున్నది కాని, లాభం లేకపోయింది.

20వ తేదీ సాయంత్రం తిరిగి విచారణ ప్రారంభమైంది. బ్రయాన్ ఆదమిస్టు, బైబిలు వాదితుడు, వక్త, రాజకీయవేత్త. బైబిలు ప్రమాణాన్ని గురించి బోనెక్కి సాక్ష్యమీయడానికి ఆయన అంగీకారాన్ని సాధించాడు డారో. బ్రయాన్‌ని బోనెక్కించి ప్రశ్నల్తో ముంచెత్తాడు. గంటన్నరసేపు ఉడికించాడు. బైబిలు ఆధారంగా మనిషి అవతరణనీ, నాగరికత అభ్యుదయాన్ని వివరించవలసిన బాధ్యత బ్రయాన్ పైన పడింది.

డారో ప్రశ్నలకు బ్రయాన్ గుక్కతిప్పుకోలేక పోయాడు: “యోనాను తిమింగిలం మింగిందా?” (బైబిలు ప్రకారం అపవిత్రమైన పనిచేసినందుకు యోనాను ఓడమీదనుంచి సముద్రంలోకి పడద్రోస్తే, అతన్నొక పెద్దచేప మింగి, మూడు రోజుల తర్వాత అతనికిహాని కలుగకుండా తీరంలోకక్కివేసింది.)

“భూమిని తన చుట్టూ తానుతిరగకుండా యెహోషువా ఆపాడా?”

(బైబిలు కథనం ప్రకారం యెహోషువా సూర్యుణ్ణి కదలవద్దని ఆజ్ఞాపించాడు.)

“కయీను’ తన పెండ్లాన్ని యెక్కడనుంచి తెచ్చుకున్నాడు?” (బైబిలు ప్రకారం ఆది దంపతులయిన ఆదాము, హవ్వల పెద్దకొడుకు కయీను. ఇక వేరే ఎవరూ మనుషులులేరు కాబట్టి ఆదాము, హవ్వల సంతానాన్నే ‘కయీను’ పెండ్లిచేసుకొన్నాడు—అంటే సొంత చెల్లెలిని).

బ్రయాన్‌కు ముచ్చెమటలు పోసినై. చివరకు భూమి వయస్సు కొన్ని కోట్ల సంవత్సరాలై ఉండవచ్చునని ఒప్పు

కొన్నాడు (బైబిలు ప్రకారం భూమి వయస్సు 6000 యేండ్లు)

"దేవుడు పొట్ట మీదుగా నడవమని ఆజ్ఞాపించక ముందు పాము ఎలా నడిచింది? తోక మీద గెంతిందా?" అని అడిగేటప్పటికి జనం విరగబడి నవ్వారు. బైబిలు ప్రకారం దేవుడి శాపం వల్లనే సర్పం పొట్టమీదుగా ప్రాకడం ప్రారంభించింది.

బైబిలును తేలికపరచటమే డారో లక్ష్యమంటూ బ్రయాన్ మండిపడ్డాడు. డారో ప్రతిగర్జన చేశాడు. జనం అదుపుతప్పి కొట్లాటకు దిగే పరిస్థితి యేర్పడేటప్పటికి జడ్జి వాయిదా వేశాడు.

జడ్జి అప్పటివాకా దూరంగా ఉంచిన జూరీని మళ్ళీ పిలిపించుకొన్నాడు. అందరూ తీర్పుకోసం ఎదురు చూస్తున్నారు. అప్పీలుకు వీలుండేటట్లు తీర్పు కావాలని డారో సూచించాడు. అంటే, శిక్షతప్పదని ముందే తెల్సుకొన్నాడన్న మాట. జూరీ అంగీకరించింది. స్కోప్సుకు 100 డాలర్లు జరిమానా విధించాడు రాల్‌స్టన్.

కోతిచట్టం! కోతిన్యాయం!! కోతితీర్పు!!!

ఐతే, పాపం అంతకష్టపడ్డ బ్రయాన్ ఆ తీర్పు విన్న ఐదవ నాటి రాత్రి నిద్రపోయినవాడు మళ్ళీ లేవలేదు. చచ్చి ఊరుకొన్నాడు. ఇదే డారో మరణించి వుంటే, దేవుడు శాపం పెట్టాడని డప్పుకొట్టే వారు మతస్థులు.

స్కోప్సు మాత్రం ఉన్నత పరీక్షలకు చదివి, పై ఉద్యోగాల్లోకి పోయాడు.

నిజానికి స్కోప్సు పరిణామవాదం పాఠాలు చెప్పలేదు. చరిత్రలో అతని పేరు స్థిరపడి పోవడానికొక పరీక్ష. ఆ పరీక్షలో నెగ్గాడు.

తర్వాత 1926లో టెనెస్సీ రాష్ట్రసుప్రీంకోర్టుకు అప్పీలు చేస్తే. దాన్ని తిరిగి జిల్లా కోర్టుకు రిమాండు చేయించి స్కోప్సు జరిమానా రద్దుచేశారు.

కానీ, బట్లర్ యాక్టు—మ,కిలా--అలాగే ఉండిపోయింది.

ఇక మతస్థుల ఆగడానికి పట్టపగ్గాల్లేకుండా పోయింది. బట్లర్ యాక్టువంటివాన్నే మిసిసిపి రాష్ట్రంలో కూడా పాస్‌చేయించారు. అర్కన్సాస్ రాష్ట్ర శాసనసభలో అది పాస్‌కాకపోతే రోటంబరీ చట్టంపేరుతో ప్రజాభిప్రాయం (రిఫరెండం) ద్వారా పాస్ చేయించారు. ఇప్పటికీ ఆ చట్టాలు అలాగే ఉన్నాయి. ఈ మధ్య కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఎడ్యుకేషన్ బోర్డు "పరిణామవాదాన్ని ఒక సిద్ధాంతంగా మాత్రమే బోధించాలిగాని, సత్యవిషయంగా బోధించరా" దని పాఠశాలలకు ఆదేశాలిచ్చింది.

ఐతే యీ వ్యవహారం 1925తో ఆగిపోలేదు.

ఆర్కన్సాస్ రాష్ట్రంలో, లిటిల్ రాక్ నగరంలో సుసాన్ ఎప్పర్సన్ అనే జీవశాస్త్రాధ్యాపకుడున్నాడు. రోటంబరీ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించవలసిందిగా ఆయన 1965లో అమెరికా (యు. ఎస్ ఏ.) సుప్రీంకోర్టులో దరఖాస్తు పెట్టాడు.

ఎప్పర్సన్ న్యాయవాది. రోటంబరీచట్టం అస్పష్టంగా ఉన్నదనీ, పరిణామ సిద్ధాంతం అంగీకృత సత్యమనీ, అర్కన్సాస్ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో వాడే జీవశాస్త్ర

గ్రంథంలో పరిణామంమీద ఒకఅధ్యాయంఉన్నదనీ. కొందరు ఉపాధ్యాయులు ఆఅధ్యాయాన్ని చట్టవిరుద్ధమనివదలివేస్తున్నారనీ, అలా అయితే జీవపరిణామాన్ని గురించి వివరించక తప్పని నిఘంటువుల్ని, సర్వస్వాల్ని [ఎన్ సైక్లోపెడియా] విద్యార్థులకు పరిచయం చేయటం కూడా నేరమే అవుతుందనీ వివరించాడు.

న్యాయమూర్తులకు యీ విషయాలన్నీ తెలుసు. ఐనా. తమాషాపట్టిద్దా మనుకొని అర్కనాన్సస్ రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాదిని ఉద్దేశించి "ఒక రాష్ట్రం జామెట్రీని నిషేధిస్తే తప్పేముంది ?" అనీ "అర్కనాన్సస్ భూమి గుండ్రంగా ఉన్నదనే సిద్ధాంతాన్ని నిషేధిస్తే మాత్రం తప్పేముంది ?"అని

ప్రశ్నించేసరికి కోర్టుహాలంతా గొల్లుమంది.

చివరకు 1968 నవంబరు 12న "అర్కనాన్సస్ సుప్రీంకోర్టు తీర్పు" రాజ్యాంగానికి విరుద్ధంగా ఒక మత సూత్రాన్ని [బైబిలు] స్థిరపరచటానికి ప్రయత్నిస్తున్నది కాబట్టి "దాన్ని రద్దుచేస్తూ" అమెరికా సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

బూజు పట్టిన పాతపుస్తకాల దస్త్రాలను నెత్తినపెట్టుకొని పూజించే మతస్థులకింకా జ్ఞానోదయం—వివేకోదయం అయ్యేదెప్పుడు ? ఎప్పుడో !

సేకరణ-అనుసరణ: రావిపూడి వెంకటాద్రి

# 7. సృష్టివాదం—పరిణామవాదం

## అమెరికాలో మతంచితి ఆరలేదు. పరిణామవాదం మీదచట్టాలతో దాడి, కోర్టుల్లో దావాలు ఆగలేదు.

బైబిలు ఆదికాండలో సృష్టిని గురించి ప్రాచీన మానవుల ఊహలు కొన్ని రికార్డయి వున్నాయి. అవి పూర్తిగా తప్పు అని ఆధునిక శాస్త్ర జ్ఞానం స్పష్టం చేస్తున్నది. భూమి సూర్యుడిచుట్టూ తిరుగుతూ వున్నదన్న వాస్తవం కొన్నాళ్ళు బైబిలు భక్తుల తలనొప్పికి కారణభూతమైంది. అది మూడు శతాబ్దుల క్రిందటి విషయం. బైబిలును తప్పు పడుతున్న ఆ వాస్తవాన్ని చివరకు క్రైస్తవులంతా అంగీకరించారు.

అంతలోనే చార్లెస్ డార్విన్ వచ్చాడు. మనుషులంతా కోతుల నుంచి పరిణామం చెందివచ్చారని మరొకవాదాన్ని లేవదీశాడు. ఇది జరిగి వందసంవత్సరాలు దాటింది. ఇది బైబిలు సృష్టి సిద్ధాంతానికి వ్యతిరేకం. ప్రాణాంతకం. అందువల్ల డార్విన్ కాలం నుంచి యీనాటి వరకు పరిణామసిద్ధాంతం మీద మతస్థులు యుద్ధం చేస్తూనేవున్నారు. ఓడిపోతూనే వున్నారు. శాస్త్రం ఒరిపిడికి బైబిలు నిలవలేదు. ఇకపరిణామవాదంకూడా శాస్త్రీయం కాదని పోరాటం ప్రారంభించారు. తిరిగి ఓడిపోయారు. కోర్టులకెక్కారు. ఓడిపోయారు. రాష్ట్ర శాసన సభలచేత పరిణామ వాదానికి విరుద్ధంగా చట్టాలు చేయించడం ప్రారంభించారు. ఆ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని కోర్టులు నిర్ణయించడం ప్రారంభించినై. చివరకు అర్కన్‌సాస్ రాష్ట్రంలో మరొకచట్టం చేయించారు: "బైబిలులోని

సృష్టివాదాన్ని పరిణామవాదం సరసన పెట్టి విద్యాలయాల్లోనూ బోధించాలి" అనేది దాని సారాంశం. వారిదృష్టిలో బైబిలువాదం "సృష్టిశాస్త్రం". జీవశాస్త్రజ్ఞులవాదం "పరిణామశాస్త్రం." కాని, ఫెడరల్ కోర్టు 5 జనవరి 1982న పై చట్టం రాజ్యాంగవిరుద్ధమని క్రైస్తవమతస్థులకు వ్యతిరేకంగా తీర్పుచెప్పింది.

టెన్నెస్సీ, అర్కన్‌సాస్, మిసిసిపి రాష్ట్రాల్లో పాఠశాలల్లో 1925 నుంచీ పరిణామ సిద్ధాంతబోధనని నిషేధించి బైబిలు ఆదికాండలోని సృష్టిసిద్ధాంత బోధతోనే ఊరేగుతున్నై. ఆ చట్టాలను రాజ్యాంగవిరుద్ధమంటూ, మతబోధకు ఉద్దేశించబడినవంటూ సుప్రీంకోర్టు 1967-72 మధ్యవాటిని రద్దుచేసింది.

అమెరికన్ రాజ్యాంగం ప్రకారం మతాన్ని విద్యాలయాల్లో ప్రవేశపెట్టరాదు. బైబిలు మతగ్రంథం. బైబిల్లోని సిద్ధాంతబోధ మతబోధ అవుతుందేకాని శాస్త్రబోధకాదు. ఈ విషయాన్ని తనతీర్పులోస్పష్టంగా ప్రకటించిన జస్టిస్‌విలియం ఓవర్‌టన్ న్యాయం చేశాడనే దానికంటె, సాహసంచేశాడనడమే సబబు. ఎందుకంటే అమెరికాలో ఫండమెంటలిస్టు ఉద్యమం చాల బలంగావుంది. ఎంతో విత్తసంపద వారిస్వాధీనంలో వుంది. దానికి వ్యతిరేకంగా తీర్పుచెప్పడానికి ఎంతో ఆత్మస్థయిర్యం, సత్యనిరతి కావాలి. అయితే అర్కన్‌సాస్ కోర్టు ఆ తీర్పు యిచ్చినరోజునే, అదేరకమయిన మరొక చట్టాన్ని మిసిసిపి రాష్ట్రం ఆమోదించింది. కాబట్టి మతస్థులు "తుదిదాకా" తమ పోరాటం సాగించడానికి నిర్ణయించుకొన్నారన్న మాట! అందుచేత అమెరికా రాజ్యాంగం సెక్యులరిజానికి ప్రత్యేకించిన రక్షణకవచం క్రింద పరిణామ వాదానికి హానిజరుగుతుందని

మనం భయపడనవసరంలేదు. అర్కాన్‌సాస్ కోర్టు తీర్పులో ఎపర్‌టస్ చర్చించిన తీర్పునుబట్టి భారతరాజ్యాంగంకంటె అమెరికన్ రాజ్యాంగమే ఎక్కువ సెక్యులర్ అని అర్థమవుతుంది. భారత దేశంలో సెక్యులర్ రాజ్యాంగం క్రిందవున్న భారత ప్రభుత్వం అనేక యాంటీ సెక్యులర్ కార్యక్రమాలను సాగిస్తున్నది. మనం కూడా ఆవైఖరిని నిరోధించడానికి రాజ్యాంగాన్ని సాధనంగా వుపయోగించుకోవచ్చు. హేతువాద మిత్రులు ఆ విషయాన్ని పరిశీలించగలందుకు ఆ తీర్పులోని ముఖ్యాంశాలను సంక్షిప్తీకరించి ప్రకటిస్తున్నాం.

—రావిపూడి వెంకటాద్రి

# 8. అర్కాన్‌సాస్ కోర్టుతీర్పు

**పరిణామవాదమా ? బైబిలా ? ఏదిశాస్త్రం? బైబిలు అశాస్త్రీయ మతగ్రంథమనీ, పరిణామవాదం శాస్త్రమనీ అమెరికాలోని అర్కాన్‌సాస్ కోర్టులో న్యాయమూర్తి విలియమ్ ఓవర్‌టన్ 5 జనవరి 1982న యిచ్చిన చారిత్రాత్మకమయిన తీర్పు సారాంశం.**

"సృష్టి శాస్త్రాన్ని, పరిణామ శాస్త్రాన్ని సమానంగా పరిగణించే అర్కాన్‌సాస్ రాష్ట్ర ప్రభుత్వ చట్టం 590" మీద 19 మార్చి 1981న అర్కాన్‌సాస్ గవర్నరు సంతకం చేశారు. దాని ప్రకారం వాటిరెంటినీ శాస్త్రంగా పరిగణించి విద్యావిధానంలో బోధించాలి. 27 మే 1981 న ఆ చట్టాన్ని రాజ్యాంగ పరంగా సవాల్ చేస్తూ దావా వచ్చింది. డిసెంబరు 7-17 మధ్య విచారణ జరిగింది. రాజ్యాంగంలోని ప్రథమసవరణ "ఎస్టాబ్లిష్ మెంట్" సూత్రం ఓర్గాదుకాంశమైంది.

1. "విద్యాలయాల్లో మతబోధ" ప్రవృత్తి వచ్చినపుడు ఎన్నో సార్లు సుప్రీం కోర్టు ఆ సూత్రాన్ని విస్పష్టంచేసింది. 1947లో ఒక తీర్పులో జస్టిస్ బ్లాక్ యిలా వ్యాఖ్యానించాడు :

"ప్రథమ సవరణలో "ఎస్టాబ్లిష్‌మెంట్" (మత వ్యవస్థాపన" అనే సూత్రార్థం ఇది : ఒక రాష్ట్రంగాని, ఫెడరల్ ప్రభుత్వంగాని చర్చిని (మతాన్ని) ఏర్పాటు చేయరాదు. ఒక మతాన్ని గాని, అన్ని మతాలను గాని ప్రోత్సహించే

శాసనాలు చేయరాదు. ఒక మతాన్ని అవలంబించమని కానీ, వద్దని కానీ-వ్యక్తి యిష్టానికి వ్యతిరేకంగా నమ్మమని కానీ, వద్దనికానీ బలవంతం చేయరాదు. మతాన్ని నమ్మినందుకు కానీ, నమ్మనందుకు కానీ - చర్చికి హాజరైనందుకు కానీ, కానందుకు కాని ఎవరినీ శిక్షించరాదు. ఏ రాష్ట్రంకానీ, ఫెడరల్ ప్రభుత్వం కానీ - బహిరంగంగాకానీ, రహస్యంగాకానీ, ఏ మత కార్యకలాపాల్లోనూ పాల్గొనరాదు. జఫర్సన్ మాటల్లో చెప్పాలంటే —చర్చికి, రాజ్యానికి మధ్య అడ్డుగోడ నిర్మించడమే ఆ క్లాజ్ (సూత్రం) ఉద్దేశం."

1943లో జె. ఫ్రాంక్‌ఫర్టర్, జె. జె. రూట్లెడ్జి, జాక్సన్ బర్టన్ అనే న్యాయమూర్తులు కూడా విద్యారంగంలో యిదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు :

"ప్రజాస్వామ్యం మీద విశ్వాసంకల అనేక జాతుల ప్రజల మధ్య సంఘీభావాన్ని పెంపొందించవలసిన విద్యాలయాలు వాటి మధ్య యే విధమైన ఘర్షణ కూడా రాకుండా వ్యవహరించాలి. వేర్పాటు ఘర్షణ రాకుండా జాతినీ, మత సంస్థల ఒత్తిడి నుంచి ప్రభుత్వాన్ని, విధి నిషేధాల నుంచి మతాన్నీ కాపాడాలంటే మతంతో ప్రమేయంలేని విద్యనే బోధించాలి. మతబోధ అనేది కుటుంబంలోనే వుండిపోవాలి."

చట్టాలు సెక్యులర్ స్వభావం కలవిగాను, మతంతో ప్రమేయం లేనివిగాను వుండాలని 1963లో జస్టిస్‌క్లార్క్ కూడా అన్నారు. పబ్లిక్ స్కూల్స్‌లో అనుదినం బైబిలు పఠనం చేయాలనేది రాజ్యాంగంలో యెక్కడా లేదు. బైబిల్ స్థానం

81165

ఇంటర్వెన్షన్. "మతవ్యవస్థాపన" విషయంగా ప్రాధాన్యతలకి తెచ్చిన మొదటి సవరణ ప్రకారం పాఠశాలల్లో ప్రార్థనలు జరిపించరాదనే తీర్పును సుప్రీంకోర్టు 1962లో ఇచ్చింది. మొదటి సవరణని 14వ సవరణ సమర్థిస్తుంది. దాని ప్రకారం అమెరికాలో ఏ ప్రభుత్వమైనా (రాష్ట్రం లేక ఫెడరల్) అధికారయుతమైన ప్రార్థన చేస్తే నిర్ణయించే అధికారం లేదంటాడు జస్టిస్ బ్లాక్. ప్రభుత్వమూ, మతమూ కలిపి ఉంటే ప్రభుత్వం నాశనమవుతుందని, మతం భ్రష్టమవుతుందని— అందుకే అలా జరగకుండా కాపాడడం కోసం ఎస్టాబ్లిష్‌మెంట్ క్లాజ్ ఏర్పాటు చేయడం జరిగిందనికూడా అంటాడు. పాఠశాల లోని తరగతి గదుల్లో "పది ఆజ్ఞలు" వ్రాసి ఉంచడానికి వ్యతిరేకంగా 1980లో సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది. కాబట్టి ఈ కేసును పరిశీలించడంలో గమనించవలసిన ప్రధానాంశాలు మూడు: 1. చట్టం లక్ష్యం లౌకికం 2. మతానికి అనుకూలంగా కానీ, ప్రతికూలంగా కానీ లక్ష్యం చేసుకోరాదు. 3. మతంతో ప్రభుత్వానికి ప్రమేయం పెట్టరాదు.

III మత సంబంధమైన కొత్త ఆలోచనలూ. శాస్త్రవిజ్ఞానానికి ప్రతికూలంగా పాశ్చాత్యులు 19వ శతాబ్దంలో అమెరికాలో ఫండమెంటలిజాన్ని లేవదీశారు. బైబిలు మాట తూచా తప్పకుండా అక్షరశః ఆమోదించడం ఫండమెంటలిస్టుల ఆశయం. మొదటి ప్రపంచ యుద్ధానంతరం పరిణామవాదం కారణంగా బైబిల విలువలు పడిపోయినవన్న అభిప్రాయంతో దక్షిణ రాష్ట్రాల్లోని విద్యాలయాల్లో పరిణామవాదాన్ని బోధించకుండా నిరోధించడానికి శాసనాలు చేసే ప్రయత్నాలు ఫండమెంటలిస్టులు చేశారు. దీని ఫలితంగానే 1929లో ఆర్కాన్సాస్ రాష్ట్రంలో

ఇనిషియేటెడ్ యాక్టు వచ్చింది. 1920–60 మధ్య పరిణామవాదంవల్ల వ్యతిరేకభావం ప్రబలింది. జీవశాస్త్ర పాఠ్యగ్రంథాలనుంచి డార్విన్ పేరు తొలగించారు. అయితే, 1957లో రష్యా వారు స్పుత్నిక్‌ని ప్రయోగించడంతో నేషనల్ సైన్స్ ఫౌండేషన్‌వారు శాస్త్రబోధనా పద్ధతులు మార్చారు. జీవశాస్త్ర పాఠ్య గ్రంథాల్లో పరిణామవాదం ముఖ్యభాగమై కూర్చుంది. మరల ఫండమెంటలిస్టుల గోల మొదలైంది. వారి సంఖ్య పెరిగింది. రాజకీయ ప్రభావం పెరిగింది. 1961లో విట్‌కాంబ్, హెన్రీ మారిస్ అనే వారు ఆదికాండలోని జలప్రళయాన్ని సమర్థిస్తూ పుస్తకం వెలువరించారు. 1963 నాటికి "శాస్త్రీయ సృష్టివాదం అన్నమాట పుట్టుకొచ్చింది. శాస్త్రం అందించే సమాచారం ఆదికాండ సమర్థిస్తున్నదంటూ 1960–70 మధ్య అనేక ఫండమెంటలిస్టు సంస్థలు పుట్టుకొచ్చాయి. వారు తమ అధ్యయనానికి 'సృష్టిశాస్త్రం', 'శాస్త్రీయ సృష్టి విధానం' అని పేరు పెట్టుకున్నారు. 1. బైబిలు దైవవాక్కు. 2. సృష్టిఅంతా వారంరోజుల్లో జరిగింది. 3. జలప్రళయంనిజం. 4. ఏసుక్రీస్తు రక్షకుడు అనే నాలుగుసూత్రాలు ప్రాతిపదికగా అనేకగ్రంథాలు వెలువరించారు.

సమాజంలోని చెడ్డలన్నిటికీ పరిణామవాదం మూలం అనేది సృష్టివాదుల దృక్పథం. బైబిలును పరిణామవాదంతో సమన్వయం చేయడం అసాధ్యమనీ, సృష్టివాదానికి అనుకూలంగా శాసనం తెచ్చినా అది రాజ్యాంగ విరుద్ధమవుతుందనీ, అందుచేత పట్టభద్రులైన విశ్వాసుల ద్వారా విద్యాలయాల్లో సృష్టివాదం బోధించబడేట్లు చూడాలనీ హెన్రీమారిస్ సూచించాడు.

న్యాయశాస్త్రంలో కానీ, విజ్ఞాన శాస్త్రంలోకానీ ప్రవేశం లేని ఎల్‌వేంజర్ సృష్టివాదానికీ పరిణామవాదానికీ–రెంటికీ సమాన ప్రతిపత్తి యిచ్చేచట్టాన్ని ఒకదాన్ని తయారుచేసి దేశమంతటా ప్రచారం చేశాడు. నిజానికి ఆయనకుకూడా సృష్టివాదంమీద నమ్మకంలేదు. సృష్టివాదమూ, పరిణామవాదమూ —రెండూ శాస్త్రాలు కావంటాడు. పరిణామవాదం రుజువు కాలేదు కాబట్టి, దాన్నింకా పరిశీలించాలేకాని బోధించరాదంటాడు. ఈ విషయంమీద ఆయన జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో "ఆర్కన్‌సాస్ రాష్ట్రంతెచ్చిన యాక్టు 590 పవిత్రమైన మతదండయాత్ర" అంటాడు. దాన్ని ఆస్తికులకు-నాస్తికులకు మధ్య జరిగే యుద్ధంగా వర్ణిస్తాడు. తన ప్రయత్నాలను సాతాను చెడగొడుతున్నాడంటాడు. ఇందులో మత ప్రమేయంలేనట్లుగా దాచటానికి ప్రయత్నించాలంటాడు. చివరకు టాంప్‌కెఫెల్‌కి రాసినఉత్తరంలో "ఇదంతా గతపది సంవత్సరాల నుంచి పరిణామవాదాన్ని చంపడానికి మేము చేస్తున్న కృషికి పరాకాష్ఠ" అని పేర్కొంటాడు. కాబట్టి బిల్లుతయారుచేసిన వ్యక్తి యొక్క నిజాయితీని శంకించవలసి వస్తున్నది. సవరణలు లేకుండా, మార్పులులేకుండా, ఐదునిమిషాలచర్చతో బిల్లుపాసైంది. సెనేటరు హాలిస్టెడ్ ఆ బిల్లును ప్రతిపాదిస్తూ అది మతాన్ని సమర్థిస్తుందనీ, అందునిమిత్తమే తాను బిల్లును ప్రతిపాదించాననీ అంగీకరించాడు. బైబిలు సృష్టివాదాన్ని విద్యాలయాల్లో బోధించబడేటట్లు చూడడమే తమ లక్ష్యమన్నాడు. గతంలో ఆర్కన్‌సాస్ రాష్ట్రంతోపాటు మరికొన్ని రాష్ట్రాలు తమమత నమ్మకాలు ఆధారంగా పరిణామవాదానికి వ్యతిరేకంగా చట్టాలను తెచ్చినై. వాటిని సుప్రీంకోర్టు కొట్టివేసింది. చట్టం లక్ష్యం యేమైనా, రాజ్యాంగ విరుద్ధమైనప్పుడు దాన్ని

ఆమోదించాలని లేదు. యాక్టు తెచ్చినవాడే సెక్టేరియస్ వర్క్స్ కోసం యాక్టుతెచ్చానన్నాడు. ఇలాంటివారి ఉద్దేశాలకుకానీ, విద్యావంతులతో-శాస్త్రజ్ఞులతో సలహా సంప్రదింపులు లేకుండా బిల్లు చేయడానికికానీ, విద్యావిషయంలో అనుచితమైన జోక్యానికికానీ, రాష్ట్రం సరైన కారణాలు వివరించలేదు. ఇదికేవలం బైబిలు సృష్టి విధానాన్ని విద్యావిషయంగా మార్చడానికి చేసిన ప్రయత్నం. అంటే, మతాన్ని ముందుకు పెట్టడానికి చేసిన ప్రయత్నం. అందువల్ల "శాసనలక్ష్యంసెక్యులర్ అయి వుండాలి" అన్న తొలిసూత్రాన్ని యీయాక్టు వ్యతిరేకిస్తున్నది.

III యాక్టులోని భాషను పరిశీలిస్తే దాని ఉద్దేశం, ఫలితం విద్యాలయాల్లో మతాన్ని వృద్ధిచేయడమేనని స్పష్టమవుతుంది. ఆ యాక్టులో 4వ సెక్షన్ ఇలావుంది.

(a) సృష్టిశాస్త్రమంటే సృష్టికి శాస్త్ర ప్రమాణమనీ, ఆ శాస్త్ర ప్రమాణంనుంచి రాబట్టిన నిర్ణయమనీ అర్థ: 1. శూన్యం నుంచి జగత్తూ, శక్తి, జీవం హఠాత్తుగా సృష్టించబడ్డాయి. 2. ఒక జీవినుంచి ఇన్నిరకాల జీవులు వృద్ధిపొందడానికి మ్యుటేషన్లు, నేచురల్ సెలెక్షన్ చాలవు 3. మొదట సృష్టించబడ్డ జీవజాతుల 'రకాలకు' పరిమితమై మార్పులు జరుగుతున్నాయి. 4. మనిషి పూర్వులూ, కోతి పూర్వులూ వేర్వేరు. 5. జలప్రళయంద్వారా భూగర్భ నిర్మాణం జరిగింది. 6. భూమీ, జీవరాశీ యిటీవలేయేర్పడ్డాయి. (b) పరిణామశాస్త్రమంటే పరిణామానికి శాస్త్ర ప్రమాణమనీ, ఆ శాస్త్ర ప్రమాణం ద్వారా రాబట్టబడినదనీ అర్థం: 1. చిందరవందరగావున్న పదార్థం నుంచి ప్రకృతి క్రమంద్వారా విశ్వం—నిర్జీవం

నుంచి జీవంవచ్చినై. 2. ఒక జీవినుంచి ఇన్ని రకాల జీవులు వృద్ధిపొందడానికి మ్యుటేషన్లు, నేచురల్ సెలెక్షన్ చాలు. 3. ఒక జీవినుంచి మ్యుటేషన్ల ద్వారా, నేచురల్ సెలెక్షన్ ద్వారా ఇన్ని రకాల జీవులు వచ్చినై. 4. మనిషి పూర్వులూ, కోతి పూర్వులూ ఒకరే, 5. పరిణామ క్రమంలో భూగర్భ నిర్మాణం జరిగింది. 6. వేలకోట్ల సంవత్సరాలక్రితం భూమీ, ఆ తర్వాత జీవమూ యేర్పడినై.

సెక్షన్ 4 (a) ప్రకారం బైబిలు ఆదికాండలో మొదటి 11 అధ్యాయాలూ ఆమోదించడమవుతుంది. మానవచరిత్రలోని ఇతిహాసిక గ్రంధాలన్నిటిలోనూ శూన్యం నుంచి సృష్టి, జలప్రళయంద్వారా అంతా నశించడమన్నవి సర్వసాధారణమైనవే. 4 (a) అంతా మతవాదనే. 4 a) 2 మాత్రం పరిణామవాదం మీద మ త వా దు లు చేసే వ్యతిరేకవాదంలో భాగం. సృష్టి సిద్ధాంతాన్ని బలపరచడానికి ఈ 4 (a) 2 ఎందుకుచేర్చవలసి వచ్చిందో తనకు తెలియదని పాల్ ఎల్వేంజర్ అంగీకరించాడు. తాను శాస్త్రజ్ఞుణ్ణి కాననీ, వాటిని సృష్టి శాస్త్రజ్ఞులు ప్రతిపాదించారనీ తలవంచాడు. కాని, సెక్షన్ 4 (a) లోని పదజాలమంతా అనివార్యంగా మత భావనని సూచిస్తున్నది. 4 (a) 1 శూన్యం నుంచి సృష్టి జరిగినట్లు వర్ణిస్తున్నది. 'దేవుడు సృష్టిచేశాడని దాని భావం' అని ప్రతి మతసాక్షి సాక్ష్యమిచ్చాడు. వాళ్ళెవరేమి చెప్పినా శూన్యం నుంచి సృష్టి అనేది పాశ్చాత్య మతానికి లక్షణం సృష్టికర్త దేవుడు సర్వశక్తివంతుడని వారి భావం. "దేవుడున్నాడని బోధించడం మ తం కా దు" అనే వాదాన్ని ఇంతకు ముందటి తీర్పులు ఆమోదించలేదు. ఆ ది కాం డ ను

మక్కికిమక్కి సెక్షన్ 4(a)లో చేర్చడం ప్రత్యేకంగా ఒక మత నమ్మకాన్ని ముందుకు తోయడమే అవుతుంది.

ఈ యాక్టులోవున్న వైఖరి అంతా ఫండమెటలిస్టుదే. సృష్టివాదుల ద్వంద్వ సిద్ధాంతానికి శాస్త్రీయమైన పునాదిగాని, న్యాయమైన బోధనా విలువకాని లేదు. మనుషులు, మొక్కలు జంతువులు ఆవిర్భవించడానికి అది రెండు వివరణలిస్తున్నది. అది దేవుడి సృష్టి అయినాకావాలి, కాకుండానైనా వుండాలి. పరిణామాన్ని బలపరచలేనీ రుజువులన్ని సృష్టి వా దా న్ని బలపరుస్తున్నాయనడం అసందర్భం. నిజమైన క్రైస్తవుడు రాజీపడడనీ, సృష్టివాదం – ప రి ణా మ వా దం ఒకచోట యిమడవనీ చెప్పిన మారిస్ రెండు సిద్ధాంతాలనూ బోధించాలనడం హాస్యాస్పదం.

సృ ష్ట్యా రం భ విషయాన్ని పరిణామసిద్ధాంతంలో భాగంగా పరిగణించడం సృష్టివాద సాహిత్యంలో ఒక విశేషం. జీవారంభ విషయం జీవశాస్త్రంలో భాగమైనప్పటికీ శాస్త్రజ్ఞులు దాన్ని పరిణామ సిద్ధాంతంలో భాగంగా పరిగణించరు. జీవం యెలా పరిణామం చెందిందో పరిణామ సిద్ధాంతం వివరిస్తుంది. దేవుడు లేడనే వాదంతో అది ప్రారంభం కాదు. కాబట్టి 4వ సెక్షన్ లోని అనుమానమే దోష భూయిష్టం. దేవుడిమీద నమ్మకం–జీవపరిణామ సిద్ధాంతం పరస్పర వైరుధ్యమన్న ప్రాతిపదికే తప్పు. అది చాలమంది మత దృక్పధానికి వ్యతిరేకం. ఆస్తికత్వంలో కూడా డాక్టరేట్ తీసుకున్న జన్యుశాస్త్రజ్ఞుడు ఫ్రాన్సిస్కో అయలా పరిణామ సిద్ధాంతంమీద పనిచేసే వారిలో కూడా చాలా మంది మతస్థులున్నారని అన్నాడు. చట్టంలోని 4(b) అసం

బద్ధం. మ్యుటేషన్లు, నేచురల్ సెలక్షన్ మాత్రమే పరిణామం తెస్తాయని జీవశాస్త్రజ్ఞులు అనరు. హేతుబద్ధంగా ఆలోచించే యేశాస్త్రజ్ఞుడూ భూమివయస్సు మిలియను సంవత్సరాల కంటె తక్కువని అనజాలడని డా. విక్రమసింఘ్ సాక్ష్యమిచ్చాడు.

శాస్త్రబోధనలో యీ ద్వంద్వ విధానానికి విద్యాపరమైన విలువలేదు. 'సృష్టి శాస్త్రం' శాస్త్రం కాదు. ఏదైనా శాస్త్రంగా గుర్తించబడడానికి స్వేచ్ఛా సమాజంలో శాసనం అవసరంలేదు. శాస్త్రం లక్షణాలు ఇవి: 1. అది ప్రకృతి నియమాలను అనుసరించాలి. 2. ప్రకృతి నియమం ప్రకారం అది వివరణాత్మకంగా వుండాలి. 3. ప్రత్యక్ష ప్రపంచంలో దాన్ని పరీక్షించడానికి వీలుండాలి. 4. దాని నిర్ణయాలు సర్దుబాటుకు వీలయినవిగా వుండాలి. అవే చివరి మాటలుకారాదు. 5. దాన్ని తప్పుపట్టడానికి అవకాశం వుండాలి. అయితే సెక్షన్ 4 (a)లో వర్ణించబడిన ప్రకారం సృష్టిశాస్త్రానికి యీ లక్షణాలేమీ లేవు.

4 (a) 1 శూన్యం నుంచిసృష్టి జరిగిందని అంటుంది. అది శాస్త్రంకాదు. ఎందుకంటె దానికొక అతీత శక్తి జోక్యం కావాలి. ఆ శక్తి ప్రకృతి నియమాలకులోబడాలి. కానీ, ప్రకృతి నియమాల ప్రకారం దాన్ని వివరించడానికి వీలులేదు దాన్ని పరీక్షించడానికి వీలులేదు. అది తప్పని రుజువు చేయడానికి వీలులేదు. (దాన్ని అంగీకరించి తీరవలసిందే.) "దేవుడెలా సృష్టించాడో మాకు తెలియదు. అతను ఏ క్రమాన్ని ఉపయోగించాడో, మాకు తెలియదు. దేవుడు ఏ పద్ధతులు అనుసరించాడో, ఆ పద్ధతులు ప్రపంచంలోయెక్కడా పనిచేయ

తంలేదు. అందుకే దైవసృష్టిని మేము ప్రత్యేక సృష్టిఅంటాం. దేవుడు ఉపయోగించిన సృజనాక్రమాన్ని శాస్త్రపరిశోధన ద్వారా మనం కనుగోలేము" అంటాడు గిష్.(ఇది శాస్త్రమెలా అవుతుంది? ) 4వ సెక్షనులో దైవ "సృష్టి భావాన్ని తీసివేస్తే యింకేమీ మిగలదు. మిగతా మాటలన్నీ అర్థరహితాలే. "ఒక జీవినుంచి మిగతా రకాలన్నీ అభివృద్ధి చెందడానికి మ్యుటేషను. నేచురల్ సెలక్షన్ చాలు" అనేది వ్యతిరేంవాదం.మొదటసృష్టించ బడిన జీవజాతుల రకాల పరిధిలోనే మార్పులు జరుగుతున్నా యనేది సైన్సు లక్షణంకాదు. మతసాక్షుల్లో ఎవ్వరుగానీ ఎన్ని 'రకాల' జీవులున్నా వో చెప్పలేక పోయారు. 100 మొదలు 10,000 వరకు తలకొక రకంగా చెప్పారు. అలానే మనిషికీ, కోతికి వేర్వేరు పూర్వులున్నారనేది శుష్కఉద్ఘాటన. అది యే శాస్త్ర సిద్ధాంతాన్నీ ప్రమాణంగా చూపడంలేదు. మనిషిన్నీ, యీనాటి కోతులున్నూ ఎప్పుడో ఒకప్పుడు పూర్వకాలంలో ఒకే పూర్వుడ్ని కలిగి వున్నారన్న సూత్రాన్ని పరిణామవాద వ్యతి రేకులు వారుకి వక్రీకరిస్తూనే వచ్చారు. ఈనాటి కోతుల నుంచి మనుషులు వచ్చారనే అర్థాన్ని వారుతీస్తున్నారు. అలానే జలప్రళయ ఫలితంగా భూమిఏర్పడినదనే వాదం సైన్సు కానేకాదు. అతీతశక్తుల జోక్యంవల్ల అలాంటిది జరుగుతుందని వారివాదం. అది ప్రకృతి నియామాల ప్రకారం జరిగేదికాదు. అలా వివరించబడగలిగేదికూడా కాదు. అలానే 6000 సంవత్స రాలనాడు సృష్టిజరిగిందనే బైబిలు వాదంకూడా అర్థ రహితమైనది.

శాస్త్రం నిర్వచనాల ప్రకారం సృష్టిశాస్త్రమనేది నిల బడదు. వ్యక్తులుగా, మతాలుగా-జాతీయంగా, అంతర్జాతీ

యంగా—అనేక శాస్త్రశాఖల్లో సైంటిఫిక్ కమ్యూనిటీ చేసే
కృషి ప్రచురించబడుతూంది. పునః పరిశీలన, పరీక్షచేయ
బడి ఆమోదం పొందుతూవుంది. వారికి అనేకపత్రికలున్నాయి.
సృష్టివాదులు తమ శాస్త్రాన్ని సమర్థించుకోడానికి రచనలు
ప్రచురించేందుకు గుర్తింపు పొందిన పత్రికఒక్కటీ లేదు.సృష్టి
వాదంలో యేమాత్రం శాస్త్రంవున్నా, ఇంతమంది శాస్త్రజ్ఞుల్లో
ఒక్కరైనా దాన్ని ఆలోచించకుండా వదిలారనడంలో అర్థం
లేదు. సృష్టివాదుల్లో యేకీభావం కూడాలేదు. సృష్టివాదమూ,
పరిణామవాదమూ రెండూ మతాలేకాని శాస్త్రాలుకావని
ఎల్‌పేంజర్ వాదం. ఆ రెండూ శాస్త్రాలుకావని డ్యువాన్‌గిష్
వాదం. సృష్టిశాస్త్రం ఒక విధానం కాదు. నూతనఅంశాలవల్ల
సవరణకూ, లేక తిరస్కరించబడడానికీశాస్త్రసిద్ధాంతం సిద్ధంగా
వుంటుంది. మార్పును తిరస్కరించే మూఢ సిద్ధాంతం
శాస్త్రం కాదు.

సృష్టివాదులు శాస్త్ర సమాచారాన్నిచూచి, దాన్నిబట్టి
నిర్ణయాలు తీసుకోరు. ఆదికాండలోని వాక్యాలను యథా
తథంగా తీసుకొని వాటికి శాస్త్రబలం సమకూర్చుకోడానికి
ప్రయత్నిస్తారు. "బైబిలు శాస్త్రాధ్యయనం" గురించి వ్రాసిన
పుస్తకంలో మారిస్ పద్ధతిని యిలావివరించాడు: "ఈనాటి
క్రమాల ప్రకారం సృష్టిని నిర్ణయించడం అసంభవం.ఎందు
కంటే ఈనాటి క్రమాలు సృజనాత్మకం కావు. సృష్టిని గురించి
మనిషి తెలుసుకోడానికి సాధనం ఉద్బుద్ధజ్ఞానమే.సృష్టిజరిగి
నపుడు దేవుడున్నాడు. మనంలేము. దేనిని తాను చూచినట్లు
దేవుడు చెప్పాడో, దానికే పరిమితం కావాలి. అది బైబిలు
గ్రంథంలో వుంది. సృష్టిశాస్త్రంమీద .అదేమన పాఠ్యగ్రంధం"

సృష్టి పరిశోధనా సంఘంవారుకూడా యీ అశాస్త్రీయవాదమే చేస్తున్నారు. బైబిలులో వున్నదాన్ని వున్నట్లుగా చరిత్రఅనీ, శాస్త్రమనీ ఆమోదించేవారే ఆ సంఘంలో సభ్యులు. వారు ఆ నమ్మకాలను కలిగివున్నందుకు వారిని కొట్టు విమర్శించడం లేదు. ఎవరైనా తమకిష్టమైన పద్ధతిలో పరిశోధనలు చేసుకోవచ్చు. కానీ పురాకృత నిర్ణయాన్ని మార్చుకోడానికి తిరస్కరించే వాదం శాస్త్ర పద్ధతికాదు

పరిణామవాదంమీద విమర్శల్ని సమర్ధనకు వుపయోగించుకోవడం సరయిన పద్ధతికాదు. జీవారంభాన్ని గురించి అనేక సిద్ధాంతాలున్నాయి. తోకచుక్కలద్వారా "జీవబీజాలు" భూమి మీదకువస్తున్నాయంటూ డా. గేస్లర్, డా. విక్రమసింఘీలు సుదీర్ఘంగాయిచ్చినసాక్ష్యం శాస్త్రజ్ఞులు ఆమోదించకపోయినా, శాస్త్రీయసమాచారంతో నిండివుంది. ఆసిద్ధాంతం ఫ్రెడ్‌హోయల్‌తో కలిసివిక్రమసింఘే వ్రాసిన "ప్రదేశం నుంచి పరిణామం"అనే పుస్తకం (1981)లో వుంది. అతన్ని మతస్థులు సాక్ష్యం తెచ్చున్నారు తప్ప, ఆయన సాక్ష్యం వారి వాదాన్ని సమర్థించదు. బైబిలు జీవారంభ వాదాన్ని ఆయన ఆమోదించడు. పైగా బైబిలు జలప్రళయాన్ని, భూమి వయస్సును గురించి చెప్పిన మాటల్ని హేతువంతుడైన యే శాస్త్రజ్ఞుడూ ఆమోదించడని ఆయన స్పష్టంచేశాడు. పరిణామ సిద్ధాంతాన్ని త్రోసివేయడానికి సృష్టివాదులు చూపుతున్న సమాచారమంతా యింతకుముందు పది సంవత్సరాల నుంచీ శాస్త్రజ్ఞుల ముందు వున్నదే. కొత్తసమాచారాన్ని వారుగా సేకరించిందేమీ లేదు. సృష్టిశాస్త్రాన్ని బోధించడానికి పాఠ్యగ్రంథం ఒకటి తయారు

చేయమని మేరియానీ విల్సన్‌కు బాధ్యత అప్పగించగా సృష్టి శాస్త్రమనేదాన్ని గురించి తాను వినలేదని ఆమె చెప్పింది. తీరా సృష్టివాదుల సాహిత్యమంతా ఆమె తిరగవేస్తే, అదినమ్మకమేకాని శాస్త్రం కాదని తేలింది.

కాబట్టి ఈ చట్టం మతాన్ని ప్రచారం చేయడానికి మాత్రమే ప్రవేశించబడినట్లు స్పష్టమవుతుంది కాబట్టి చెల్లదు.

ఆదికాండలోని సృష్టి సిద్ధాంతాన్ని సెక్యులర్ విధానంలో వివరించడానికి మార్గమే లేదు. శూన్యం నుంచి హఠాత్తుగా సృష్టి ఎలా జరిగింది? ప్రపంచమంతటా జలప్రళయం ఎలా జరిగింది? సృష్టిజరిగి కొద్దికాలమే అయిందనేదానికి రుజువేమిటి? అనే ప్రశ్నలకు ఉపాధ్యాయుడేమి సమాధానం చెప్పగలడు?

స్వేచ్ఛానువాదం — రావిపూడి వెంకటాద్రి

# 9. డార్వినిజంపై నవాబు దర్జా

'ఒకానొక నవాబు భార్య పొద్దుటనే వాకిట్లోకి రాగానే సూర్యుడి వేడి కిరణాలు వాడిగా గుచ్చుకున్నాయట! ఆ సూర్యుణ్ణి అక్కడ నుంచి తీసివేయమని ఆమె నవాబును పురమాయించిందట! నవాబు మంత్రికి ఆ ఆజ్ఞను జారీచేశాడు. మంత్రి మందిని పిలిపించి బేగంమహల్‌ని ఒకపట్టు పట్టమన్నాడు. మంది పట్టుబట్టి మహల్‌ను త్రిప్పడం ప్రారంభించారు. కొద్ది గంటలయ్యేసరికి సూర్యుడు బెదిరి మహల్‌వాకిలి ఎదుట నుంచి తొలగిపోయాడట!" మహల్ తిరగకపోయినా, పొద్దుపై కెక్కడంవల్ల మహల్‌వాకిలి సూర్య తాపం నుంచి తప్పుకొన్నది.

ఈ కథ ఎప్పుడో చదివాను. ఆ బేగంకానీ, నవాబుకానీ, మూర్ఖులని మనం కొట్టిపారేయడం తేలికే. ఇది పాతకాలపు కట్టుకథ అనుకోవడంకూడా కష్టం కాదు. కానీ, అలాంటివి కథలు మాత్రమేకాక వాస్తవాలుకూడా కావచ్చు. ఈ 20వ శతాబ్దాంతంలో, సామాన్యులుకాక రాజ్యాధినేతల విషయంలో కూడా అది సంభవమేనని ఇటీవల యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ "విద్యా" మంత్రిత్వశాఖ జారీచేసిన ఫర్మానా రుజువుచేస్తుంది.

డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం ఇస్లాం మతానికి వ్యతిరేకమని అది ప్రకటించింది. బైబిలు సృష్టి సిద్ధాంతాన్ని కొరాన్ కాపీచేసింది. ఈ భూమి గోళీకాయలాగా గుండ్రంగా వుండడంకూడా ఇస్లాం మతానికి వ్యతిరేకమే. జీవపరిణామాన్ని బోధించే పుస్తకాలను తమ విద్యాలయాల్లో నిషేధించిన ఆ నవా

బులు భూమినికూడా అప్పటిలాగా చదరపుబల్లగా మార్చడా నికి మరొక ఫర్మానా జారీచేస్తే, ఆశ్చర్యపడనవసరం లేదు. ప్రపంచంలోని శాస్త్రజ్ఞులంతా ఆమోదించిన జీవ పరిణామ సిద్ధాంతాన్ని మత దురహంకారులు నిషేధించడం చూస్తే, వారి అజ్ఞాన మహానికి అవధులున్నట్లు తోచదు. వాళ్ళంతా మనుషులు కావడానికి ఎంతకాలం పడుతుందో! అలాంటి ఏలికలున్న దేశాల్లో ఇక కోపర్నికస్‌లూ, గెలీలియోలూ, డార్విన్లూ ఎలా పుడతారు? పుడితే ఎలా బ్రతుకుతారు? ఈ జంతు ప్రవృత్తి మానవ ప్రవృత్తిగా మారడానికి ఇంకా ఎంతకాలం పడుతుంది? అజ్ఞానం జ్ఞానాన్నీ, చీకటి వెలుగునీ ఎదుర్కొం టున్నాయి. అసతోమా సద్గమయా — తమసోమా జ్యోతిర్గమయా — ఇంకెప్పుడు?

— అంచా బాపారావు

# 10. బిషప్పులాంటి మనిషికంటె కోతినయం !

మతస్థులకు అహం ఎక్కువ, ఇంగితజ్ఞానం తక్కువ. దీనికి ఉదాహరణగా 30 జూన్ 1860 న ఆక్స్‌ఫోర్డులో డార్విన్ సిద్ధాంత మీద జరిగిన చర్చ సందర్భంలో మతస్థులు ప్రదర్శించిన శుష్కవాచాలత్వాన్ని ఉదహరించుకోవచ్చు :

జీవపరిణామవాదాన్ని రుజువుచేయడానికి థామస్ హెన్రీ హక్స్‌లే పూనుకొన్నాడు. శామ్యూల్ విల్బర్ ఫోర్స్ అనే బిషప్ పరిణామవాదాన్ని ఖండిస్తూ, బైబిలులోని సృష్టివాదాన్ని సమర్థించడానికి సమకట్టాడు. అయితే పరిణామవాదం లోతులు తెలియని ఆ బిషప్ దూషణలు, ఎత్తిపొడుపులు ప్రారంభించాడు. కోతినుంచి మనిషి రావడమనేది మీ అమ్మను కన్న తాత వైపునుండి జరిగిందా? లేక మీ అబ్బను కన్న తాత వైపునుంచి జరిగిందా? అని హక్స్‌లేని హేళనచేశాడు. అయితే హక్స్‌లే నిగ్రహాన్ని కోల్పోకుండా హుందాతనంతో, శాస్త్ర ప్రమాణాలతో జీవపరిణామవాదాన్ని రుజువుచేస్తూ తన ప్రత్యర్థి వాదాన్ని చీల్చి చెండాడాడు. చివరకు బిషప్ హేళనకు సమాధానమిస్తూ "కోతిని మాతాతగా అంగీకరించడానికి నేను సిగ్గుపడడంలేదు కానీ, సంస్కారం వల్లనూ వక్తృత్వం వల్లనూ లభించిన ప్రతిభను-దురభిమానాన్ని, అబద్ధాన్ని సమర్థించడానికి తాకట్టు పెట్టేమనిషికి వారసుణ్ణని అంగీకరించడానికి సిగ్గుపడతాను" అని ముగించాడు. శ్రోతలంతా హక్స్‌లేకు జేజేలు కొట్టారు. బిషప్ ముఖంమీద కత్తివాటుకు నెత్తురు లేకుండా పోయింది. అది నుత, యీనాటి వరకు బ్రిటన్‌లోని మతస్థులు పరిణామవాదంతో తలపడడం మానివేశారు. —జి. పర్వతయ్య

# జీవపరిణామం - మతపరిణామం.

జంతువుల్లాగా, వృక్షాల్లాగా మతాలుకూడా పరిణామంలో
ఉత్పన్నమైనవే. జీవజాతుల్లాగానే అవి కూడా అసంఖ్యాకంగా
పెరిగినై. అందులో కొన్ని వికృత జీవుల్లాగా వికృతమతాలు
కూడా పుట్టినై. నరబలి, సన్యాసం, గుడిసేటి వడుపవృత్తి
వంటి వికారాలు కొన్ని మతాలసొత్తు. జీవపరిణామంలో
అసమర్థమయినవి నశించి, సమర్థవంతమయినవి యెలా
విజృంభించినవో అలాగే మతాలు కూడామేలు మేలయినవి
నిలబడి,మిగతావి నశిస్తూ వచ్చాయి. దాదాపు 10 లక్షల జీవ
జాతులు మనకుతెలుసు. అందులో మేధవున్నవి కొన్నివేల
జాతులే. కొంత యెక్కువ మేధవున్న జాతులు పదులసంఖ్యలో
వున్నై. కాని,భావనా యుతమయిన ఆలోచనవున్న జీవి
మనిషిమాత్రమే. అలానే వందలాది మతాల్లో చివరకు
మిగిలినవి కొద్దిమాత్రమే. మనిషిలో కొన్ని జంతులక్షణాలు
మిగిలిపోయినట్లే, ఎంతమంచి - మతంలో కూడా అలానే మూఢ
నమ్మకాలు మిగిలిపోయినై. అందుచేత ఈ మూఢనమ్మకాలు
ఎప్పుడు నాశనమవతాయో, మతంయొక్క జిగటమనస్తత్వం
యెప్పుడు తొలగిపోతుందో అని మనం అధైర్యం పడనవసరం
లేదు. క్రమంగా అవి పోకతప్పదు. అవి అభ్యుదయవాదాన్ని
ఎదుర్కొంటాయి. సహనం, పట్టుదల వుంటే వాటిచావు మనమే
చూస్తాం. చచ్చినమతాల కంటె బ్రతికివున్న మత మౌఢ్యాలు
విశేషమైన వేమీకాదు.

— జూలియస్‌హక్స్లే

# హేతువాద మానవవాద సాహిత్యం

## రావిపూడి వెంకటాద్రి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1. | హేతువాదం | రు. 25/- |
| 2. | హేతుత్వం-మతతత్వం | 10/- |
| 3. | హేతువాద వైఖరి | 20/- |
| 4. | నాస్తికులున్నారు, జాగ్రత్త | 10/- |
| 5. | చార్వాకులు కథలు | 15/- |
| 6. | భావవిప్లవ వైతాళికుడు-కవిరాజు | 50/- |
| 7. | Reason & Unreason | 10/- |
| 8. | భౌతిక వాస్తవికవాదం | 10/- |
| 9. | Rationalism | 35/- |
| 10. | Why Rationalism ? | 10/- |
| 11. | హేతువాదం (వ్యాసంగం) | 5/- |
| 12. | రినైజాన్స్ | 5/- |
| 13. | కళ-శాస్త్రం-తత్వం-హేతువాదం | 20/- |
| 14. | వివేకం-అవివేకం | 10/- |
| 15. | వైమనస్యత | 5/- |
| 16. | చార్వాకుల చర్చ (సం) | 10/- |
| 17. | సత్యాన్వేషణ | 30/- |
| 18. | స్వామినేని హితసూచని | 20/- |
| 19. | జీవమంటే ఏమిటి? | 10/- |
| 20. | ఇస్లాం-ఒకఅంచనా | 10/- |
| 21. | Life and Soul | 10/- |
| 22. | శంకరాచార్యుడి హత్య | 10/- |
| 23. | విశ్వతత్వం | 25/- |
| 24. | అయోధ్య-ఆలయరాజకీయం | 10/- |
| 25. | ఆదిశంకరాచార్య: వ్యక్తిత్వం-తత్వం | 50/- |
| 26. | వైదికభాందవం- మతపునరుజ్జీవనప్రమాదం | 25/- |
| 27. | జీవం-ఆత్మ | 10/- |

28. సత్తు-చిత్తు 5/-
29. శాస్త్రం-అశాస్త్రం 40/-
30. బైబిలు గడాచారం 10/-
31. మతజాడ్యాల మచ్చుతునకలు 30/-
32. రాడికల్ హ్యూమనిస్టు దర్శనం (మానవుడు-సమాజం-ప్రకృతి) 25/-
33. భావవిప్లవం-వర్గచైతన్యం 20/-
34. ఎం.ఎన్.రాయ్-భారతకమ్యూనిజం 150/-
35. మార్క్సిస్టుగతితర్కం 15/-
36. ఎం.ఎన్. రాయ్ దర్శనం (వం) 25/-
37. అడుగుజాడలు 30/-
38. డార్విన్‌నిజం-హేతువాదం 10/-

## ఇతరులరచనలు

1. The Rhythm of Cosmos (M-N- Roy) 10/-
2. హేతువాద సూత్రాలు (పి. భీమన్న) 10/-
3. మానవతావధంలోమహిళ (S.S. లక్ష్మి) 10/-
4. నరహంతకులు (డా॥ ఇన్నయ్య) 10/-
5. ఈ దేశంలో పునర్వికాసం రాదా?(") 60/-
6. బైబిలుదర్శిని (పియస్సార్) 25/-
7. Rationalist Esssys Dr- Innaiah & Babu) 20/-
8. Humanist Way " 75/-
9. దేవుని ఆటకట్టు ఎ. హరనాథ్ & సూర్యనారాయణ 10/-

1982-94 వరకు "హేతువాది" ఒక్కొక వాల్యూం రు. 50/-
12 వాల్యూములు రు. 600/-

## 1995లో విడుదలకానున్నవి

1. సెక్యులర్ హ్యూమనిస్టు మార్గం రావిపూడి
2. హేతువాదం-నాస్తికత్వం "
3. బైబిలు సృష్టివాదం రావిపూడి + P.S.R.
4. నాపరిశీలనలో బైబిలు

ACA 81165

5. బైబిలు దేవుడి ఆటకట్టు ,,
6. ఆధునిక విజ్ఞానం ఆరమళ్ళ పూర్ణచంద్ర
7. పిల్లి ఆత్మకథ ఎం.ఎన్. రాయ్ (అను॥ వి.కోమల)
8. అబద్ధాల వేట డా॥ ఎస్. ఇన్నయ్య
9. రాడికల్ హ్యూమనిజం (తార్కుండే) అను జి. వీరన్న
10. వాస్తువు శాస్త్రమా ? A. ప్రపుల్ల చంద్ర

# పునర్ముద్రణ కావలసినవి

1. విశ్వాన్వేషణ 4వ ముద్రణ రావిపూడి వెంకటాద్రి
2. నాస్తికత్వం–నాస్తితత్వం 2వ ముద్రణ ,,
3. హేతువాదం–అజ్ఞేయవాదం ,, ,,
4. హేతువాదయుగకర్త–కవిరాజు ,, ,,
5. తెలుగు సాహిత్యంలో హేతువాదం ,, ,,
6. సెక్యులరిజం–శాస్త్ర ప్రపంచం ,, ,,
7. రాడికల్ హ్యూమనిజం 3వ ముద్రణ ,,
8. శాస్త్రం–పురాణం 4వ ముద్రణ ,,
9. శాస్త్రం–మతం 2వ ముద్రణ ,,
10. జ్యోతిష్యం శాస్త్రమా ? ,, ,,
.11 ఐన్‌స్టీన్ : మతం–దైవం ,, ,,
12. జ్యోతిషం శాస్త్రం కాదు (నం) ,, ,,
13. మార్క్సిస్టు భౌతికవాదం ,, ,,
14. మార్క్సిస్టు వాస్తవికత ,, ,,
15. హేతువాద దర్శిని (నం) ,, ,,
16. Why Dialectical Materialism is Unscientific ,,
17. గతితర్కం శాస్త్రీయమా ? ,, ,,
18. హేతువాదం–మానవవాదం ,, ,,
19. మానవవాదం–శాస్త్రీయదృక్పథం ,,
20. అయోధ్యలో ఆలయమా ?
21. ఫాసిజం (అను)
22. హ్యూమనిస్టు ఆర్థికవిధానం (అను)
23. భారతదేశం గోపూజ (అను)

8॥ఆ-




రావిపూడి వెంకటాద్రి

జన్మస్థానం: నాగండ్ల,
ఇంకొల్లు మండలం,
ప్రకాశం జిల్లా 523 190 (AP).
ఉద్యమ చిరునామా;
ఎడిటర్, హేతువాది
చీరాల 5.3-155 (AP).


| | |
|---|---|
| జననం | 9 ఫిబ్రవరి 1922 |
| కవిరాజాశ్రమ స్థాపన | 5 ఏప్రిల్ 1943 |
| రాడికల్ డెమోక్రటిక్ పార్టీలో ప్రవేశం | 1945 |
| రాడికల్ హ్యూమనిస్టు ఉద్యమ ప్రవేశం | 1948 |
| భారత హేతువాద సంఘంలో ప్రవేశం | 1949 |
| ఆంధ్ర ప్రదేశ్ హేతువాద సంఘ అధ్యక్షత | 1979-89 |
| భారత హేతువాద సంఘ ఉపాధ్యక్షత | 1985-89 |
| భారత హేతువాద సంఘ అధ్యక్షత | 1989-నుండి |
| ఆం॥ ప్ర॥ రాడికల్ హ్యూమనిస్టు సంఘ అధ్యక్షత | 1993-94 |
| కవిరాజు అవార్డు | 1988 |
| తాపీ ధర్మారావు అవార్డు | 1992 |
| అమెరికా పర్యటన; హాలెండు సందర్శన | 1993 |
| "హేతువాది" మాసపత్రిక నిర్వహణ | 1982-నుండి |
| హేమా పబ్లికేషన్స్ స్థాపన | 1992 |
| ప్రచురించిన గ్రంథాలు | సుమారు 60 |